

పద్దు.. ముద్దయ్యేనా?

- నేడే కేంద్ర బడ్జెట్.. » నిర్మలమ్మ పద్దుపై అన్ని వర్గాల్లో ఆశలు
- పాత పన్ను విధానంలో శ్లాబుల సవరింపుపై వేతనజీవుల ఎదురుచూపు
- బంగారం కొనుగోలుపై రూ.5లక్షల వరకు పాన్‌కార్డు మినహాయింపుపై ఆశలు
- బడ్జెట్‌లో నిధులు కేటాయింపు లేక జిల్లాలో వెక్కిరిస్తోన్న విభజన హామీలు
- కాకినాడలో రూ.300కోట్లతో ఐఐపీ,ఐఐఎఫ్‌టీ ఏర్పాటు ఇప్పటికీ కలగానే...
- ఏళ్లు గడుస్తున్నా ప్యాకేజింగ్ ఇనిస్టిట్యూట్ గాల్లోనే..
- జేఎన్టీయూ తాత్కాలిక భవనంలో ఐఐఎఫ్‌టీ క్యాంపస్
- రూ.32వేల కోట్లతో తలపెట్టిన పెట్రోకెమికల్ కాంప్లెక్స్ సైతం గాల్లోనే..
- కేంద్రంలో కూటమి కీలకస్థానంలో ఉన్నందున ఈసారైనా న్యాయం జరిగేనా?



నేడు కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో సర్వత్రా నిర్మలమ్మ పద్దుపై అన్నివర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. వేతన జీవుల నుంచి మహిళల వరకు రకరకాల బడ్జెట్ మినహాయింపులపై ఎన్నోఆశలు పెట్టుకున్నాయి. అటు ఏళ్లు గడుస్తున్నా జిల్లాలో విభజన హామీలు అమలుకు నోచుకోని నేపథ్యంలో ఈసారైనా కేంద్రం కరుణిస్తుందనే అంచనాలు నెలకొన్నాయి.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కేంద్రంలో కూటమి ప్రభుత్వం భాగస్వామ్యంగా ఉన్నందున వీటికి ఈదఫా అయినా మంచిరోజులు వస్తాయనే ఆశలు కొనసాగుతున్నాయి. 2014లో అప్పట్లో రాష్ట్రవిభజన సమయంలో కాకినాడలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారన్ ట్రేడ్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించింది. ఒక్కోదానికి రూ.150కోట్లు ఇస్తామని హామీ ఇచ్చింది. రూ.32వేల కోట్లతో భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు సైతం చెప్పింది. కానీ బడ్జెట్‌లు వస్తూపోతున్నా ఇప్పటికీ అవి వెక్కిరిస్తూనే ఉన్నాయి. ఒక్క ఫారన్‌ట్రేడ్ క్యాంపస్ మాత్రం జేఎన్టీయూకేలో తాత్కాలిక భవనంలో నడవడం మినహా మిగిలిన హామీలేవీ అమలుకు నోచుకోలేదు.

ఏటా అంతే.. మూటలు లేవంతే..

ప్రతి ఏటా కేంద్రం ప్రకటిస్తోన్న బడ్జెట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు ఏదొక రూపంలో నిధులు వస్తాయని ఆశించడం, ఆ తర్వాత భంగపడడం సర్వసాధారణంగా మారింది. ప్రతిసారీ బడ్జెట్ సమయంలో పాత ప్రాజెక్టులకు నిధులొస్తాయని ఆశిస్తున్నా ఆచరణలో అదేం కనిపించడం లేదు. కనీసం ఎంతోకొంత నిధులు కేటాయింపు జరుగుతుందని భావించినా రిక్తహస్తమే మిగులుతోంది. రాష్ట్ర విభజన సమయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు ప్రకటించిన ప్రాజెక్టులను కేంద్రం పట్టించుకోవడం లేదు. దీంతో అసలు ఈ ప్రాజెక్టులు జిల్లాలో ఉన్నాయా? అనే సంగతి అంతా మర్చిపోయిన పరిస్థితి. రాష్ట్ర విభజన సమయంలో అప్పటి కేంద్రప్రభుత్వం రాష్ట్రంలో ఒక్కో జిల్లాకు ఒక్కో కీలక ప్రాజెక్టు ప్రకటించింది. అందులోభాగంగా కాకినాడలో ఇండియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ ఇనిస్టిట్యూట్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారన్‌ట్రేడ్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఒక్కో దానికి రూ.150కోట్లు ఇస్తామని మాట ఇచ్చింది. తద్వారా ఈ రెండు క్యాంపస్‌ల రాకతో అటు యువతకు ఉద్యోగావకాశాలు, పరిశ్రమలకు ఎంతో ఉపయోగకరంగా ఇవి ఉంటాయని అంతా భావించారు. దీనికి తగ్గట్లే 2014 తర్వాత ఈ రెండింటికి అప్పటి బడ్జెట్‌లో కేంద్రం చెరో రూ.10కోట్లు కేటాయించింది. దీంతో ఈ రెండు క్యాంపస్‌లు చాలా వేగంగా అందుబాటులోకి వస్తాయని అంతా భావించారు. ఎలాగూ బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరగడంతో అప్పట్లో కాకినాడ సెజ్‌లో ఈ రెండు విద్యాసంస్థల ఏర్పాటుకు 50ఎకరాలు సిద్ధం చేశారు. కానీ ఆ తర్వాత కేంద్రం వీటి ఊసే మర్చిపోయింది. అప్పటినుంచి ఇప్పటివరకు ఇన్నేళ్లు గడుస్తున్నా కేంద్రం బడ్జెట్‌లో చిల్లిగవ్వ కూడా విదల్చడం మానేసింది. రెండేళ్ల కిందట అతికష్టంపై ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారన్ ట్రేడ్ క్యాంపస్‌ను తాత్కాలికంగా కాకినాడ జేఎన్టీయూలో ఏర్పాటు చేశారు. గతేడాది బడ్జెట్‌లో ఈ కొత్త క్యాంపస్‌కు శాశ్వత భవనాలు సమకూరేలా కేటాయింపులు జరగలేదు.

పెట్రో కెమికల్ కాంప్లెక్స్ లేనట్లేనా?

రాష్ట్ర విభజన సమయంలో విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అప్పటి కేంద్రప్రభుత్వం కాకినాడలో రూ.32వేల కోట్లతో భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. అందులో భాగంగా 2017లో కాకినాడ ఎస్ఈజెడ్‌లో 2వేల ఎకరాల్లో ఈప్రాజెక్టును ఏర్పాటు చేయడానికి గెయిల్-హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా ఒప్పందం కుదుర్చుకున్నాయి. 1.5 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో పెట్రో కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయడానికి వీలుగా అప్పటి టీడీపీ ప్రభుత్వ నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో అంగీకార పత్రాలు మార్చుకున్నాయి. విదేశాలనుంచి ముడి చమురు కాకినాడకు దిగుమతి చేసుకుని ఇక్కడే కర్మాగారం ఏర్పాటు చేసి దాన్ని శుద్ధి చేసి దేశీయంగా వినియోగించడం ప్రాజెక్టు ముఖ్యఉద్దేశం. ఈ ప్రాజెక్టును సాధ్య మైనంత వేగంగా పట్టాలు ఎక్కించడానికి గత టీడీపీ ప్రభుత్వం చొరవ చూపింది. కంపెనీల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపింది. చమురు కంపెనీల ఇంజనీర్లు వచ్చి సెజ్ భూమి నాణ్యత పరీక్షించి పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు అనువుగా ఉందని తేల్చారు. ఆ తర్వాత పనులు ప్రారంభించేలా కేంద్రంపై అప్పటి సీఎం చంద్రబాబు ఒత్తిడి తెచ్చారు. పైగా అప్పట్లో రాష్ట్రంలో కేంద్రానికి భాగస్వామ్యం ఉండడంతో అనుమతి పనులు చకచకా ముందుకు కదిలాయి. రూ.32వేలకోట్ల విలువైన పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటువల్ల కేంద్రం ఇచ్చే ఆర్థిక మద్దతు, రాష్ట్రప్రభుత్వం భారీగా లబ్ధి పొం దనున్నందున పన్నుల నేపథ్యంలో రూ.5,615కోట్లు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) రూపంలో తమకు చెల్లించాలని అప్పట్లో కేంద్రం మెలికపెట్టింది. అలా అయితేనే ప్రాజెక్టు ముందుకు కదులుతుందని పేర్కొంది. కానీ రాష్ట్రం విడిపోయి నష్టపోయినందున ఆ మొత్తం తాము భరించలేమని చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో కేంద్రం కొంత మెత్తబడినట్లే కనిపించింది. కానీ ఈలోపు రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావడంతో విషయం మళ్లీ మొదటికి వచ్చింది. పెట్రో కాంప్లెక్స్ విషయమై జగన్ సర్కారు కేంద్రాన్ని నిలదీయలేక అయిదేళ్లు దీనిగురించి పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కేంద్రంలో కీలకస్థానంలో ఉన్నందున దీనికి మోక్షం కలుగుతుందని భావిస్తున్నా ఇది కాకినాడలో రాకపోవచ్చని చెప్తున్నారు. ఇటీవల రామాయపట్నంలో రూ.95వేల కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీని ప్రకటించడంతో కాకినాడకు పెట్రోకెమికల్ కాంప్లెక్స్ రానట్లేనన్న చర్చ జరుగుతోంది.

వేతన జీవులకు ఊరటనిచ్చేనా..

కేంద్రం గతేడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉద్యోగ, పెన్షనర్ వర్గాల్లో కొంత ఊరట నింపింది. అందులోభాగంగా అప్పట్లో కొత్త పన్ను విధానంలో కొన్ని మార్పులు చేసింది. కొత్తపన్ను విధానంలో రూ.3లక్షల వరకు పన్ను లేకుండా చేసింది. గతంలో రూ.3లక్షల నుంచి రూ.6లక్షల శ్లాబులో వార్షిక ఆదాయం ఉన్న వారికి 5శాతం పన్ను ఉండేది. కానీ ఆ పరిమితిని రూ.7లక్షలకు పెంచారు. దీంతో 6లక్షలకుపైగా ఆదాయం ఉన్న వారికి పన్ను పోటు చాలావరకు తగ్గినట్లయింది. గతంలో రూ.6లక్షల నుంచి రూ.9లక్షల వార్షిక ఆదాయం ఉన్న వారికి పన్ను పదిశాతం ఉండేది. దాన్ని గతేడాది రూ.7లక్షలనుంచి రూ.10లక్షలకు మార్చారు. దీంతో రూ.10 లక్షల వార్షికాదాయం ఉన్న వారికి పదిశాతం పన్ను వర్తించింది. ఈ మార్పులు పాత పన్ను విధానం ఎన్నుకున్న వారికే వర్తించింది. ఇదికాకుండా పాతపన్ను విధానాన్ని కేంద్రం యధాతథంగా ఉంచింది. రూ.2.50లక్షలవరకు పన్ను సున్నా. రూ.2.5లక్షలనుంచి రూ.5లక్షల ఆదాయం కలిగిన వారికి ఐదుశాతం పన్ను, రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వార్షికాదాయం ఉన్న వారికి 20శాతం పన్నును ఉంచింది. ఈనేపథ్యంలో తాజా బడ్జెట్‌లో పాతపన్ను విధానంలో శ్లాబులను సవరించి రూ.5లక్షల వార్షిక ఆదాయం ఉన్న వారికి అసలు పన్ను లేకుండా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇదే విషయాన్ని పరోక్షంగా శుక్రవారం ప్రధాని మోదీ ప్రస్తావిస్తూ మహాలక్ష్మి కురవాలి అని పేర్కొనడం వేతనవర్గాల్లో ఆశలు రేకెత్తించింది.

---

600 కిలోలీటర్ల సామర్థ్యంతో..

వాటర్‌ట్యాంక్ నిర్మాణం

- 1800 మీటర్ల మేర పైప్‌లైన్
- 18వ వార్డులో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కార్యాచరణ
- ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చర్చావేదికలో సమస్య పరిష్కారంపై దృష్టి
- అధికారులతో సమీక్షించిన పిఠాపురం కమిషనర్ కనకారావు



ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చర్చావేదికలో వచ్చిన సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్షిస్తున్న పిఠాపురం మునిసిపల్ కమిషనరు నామా కనకారావు

పిఠాపురం,జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చర్చావేదికలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే విధంగా అడుగులు పడుతున్నాయి. వార్డు ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నూతనంగా వాటర్ ట్యాంక్ నిర్మాణం, పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రతిపాదించారు. అవసరమైనచోట్ల అదనంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నారు. కుంతీమాధవస్వామి కోనేరుని ఆధునికీకరించేందుకు దేవదాయశాఖతో కలిపి మునిసిపల్ అధికారులు ప్రణాళికను సిద్ధం చేయనున్నారు.

శాశ్వత పరిష్కారంపై అధికారుల దృష్టి

ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసేందుకుగాను ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా పిఠాపురం పట్టణంలోని 18వ వార్డు కుంతీమాధవస్వామి ఆలయంవద్ద నిర్వహించిన చర్చావేదికలో వార్డు కౌన్సిలర్ పంపనబోయిన అన్నపూర్ణతోపాటు వార్డు ప్రజలు, వివిధ సంఘాల ప్రతినిధులు పలు సమస్యలను సభలో పాల్గొన్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన నేత సూరవరపు సురేష్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, మునిసిపల్ కమిషనరు నామా కనకారావు దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే వార్డులో చెత్తాచెదారం, డ్రెయిన్లల్లో పూడిక తొలగింపు చేపట్టడంతోపాటు కుళాయిలు ద్వారా తాగునీటి సరఫరా మెరుగుకు చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. వీటిని శాశ్వతంగా పరిష్కరించే దిశగా అధికారులు ఇప్పుడు దృష్టి సారించారు.

అధికారులతో సమీక్ష

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చర్చావేదికలో ప్రజలు నుంచి వచ్చిన సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలనే అంశంపై శుక్రవారం పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ నామా కనకారావు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వార్డులోతాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకుగాను కుంతీ మాధవస్వామి గుడి లేదా గుట్ల వీధిలో 600 కిలోలీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంక్ నిర్మించాలని, అవసరమైన ప్రాంతాల్లో 1800 మీటర్ల మేర నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేయా లని ప్రతిపాదించారు. అమృత్‌నిధులు మంజూరు కాగానే ఈ పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం తాగునీటి సమస్య పరిష్కారానికిగాను అవసరమైన పైప్‌లైన్లు ఏర్పాటు చేయడం లేదా మార్పు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే 8పబ్లిక్ ట్యాప్‌లకు హెడ్‌లు ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకువచ్చినట్లు అధికారులు వివరించారు. ఉదయం, సాయంత్రం తాగునీటి సరఫరాను పరిశీలించి వచ్చే నీటి సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పారిశుధ్య నిర్వహణకోసం ప్రత్యేకంగా ఆరుగురు పారిశుధ్య సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. పుష్‌కార్టుల ద్వారా ఇంటింటా చెత్త సేకరణ చేస్తున్నామని తెలిపారు. వార్డులో సర్వే నిర్వహించి ఎక్కడ విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు అవసరమో గుర్తించాలని కమిషనరు అధికారులను ఆదేశించారు. మూడు నెలల్లోగా టిడ్కో అపార్ట్‌మెంట్లను లబ్ధిదారులను అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కుంతీమాధవస్వామి కోనేరు ఆధునికీకరణ, చుట్టూ ట్రాక్‌ఏర్పాటుకు సంబంధించి దేవదాయశాఖతో కలిపి మునిసిపల్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తారని వివరించారు. సమావేశంలో మునిసిపల్ ఏఈ అభిలాష్, ఇన్‌చార్జి ఏఈ సాయి, అకౌంటెంట్ పద్మజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



పెరిగిన భూముల ధరలు..
నేటినుంచి అమలు

- 5 నుంచి 20 శాతం వరకు పెంపు
- వెనుకబడిన ప్రాంతాల్లో తగ్గింపు
- అత్యధికంగా కాకినాడ మెయిన్ రోడ్‌లో గజం రూ.1,10 లక్షలు
- అత్యల్పంగా ఏటిమొగ శివారులో గజం రూ.5 వేలు

పిఠాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి 7.30 గంటలకు పరిస్థితి ఇది

కాకినాడ సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు పెరిగిన భూముల ధరల అమలుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 1నుంచి ఇవి అమలులోకి రానున్నాయి. ఇందుకు అవసరమైన సన్నాహాలు రిజిస్ట్రేషన్‌శాఖ ఇప్పటికే చేపట్టింది. జిల్లా కేంద్రం కాకినాడ నగరంలో 5 నుంచి 20 శాతం వరకు భూముల ధరలు పెరిగాయి. అభ్యంతరాలున్న వెనుకబడిన ప్రాంతాల్లో తగ్గించి పేదలకు ఊరట కల్పించారు. అత్యధికంగా కాకినాడ మెయిన్‌రోడ్‌లో గజం స్థలం రిజిస్ట్రేషన్ విలువ రూ.లక్షా10వేలు ఉండగా అత్యల్పంగా ఏటిమొగ శివారులో గజం విలువ రూ.5వేలుగా ఉంది. ఫిబ్రవరి 1 నుంచి పెరిగిన భూమలు ధరలు అమలులోకి రానుండడంతో కాకినాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో లావాదేవీలు ఒక్కసారిగా పెరిగాయి. కాగా నగరంలోని నివాసిత ప్రాంతాల్లో 3శాతం నుంచి 18శాతం వరకు భూమలు ధరలు పెంచారు. సాంబమూర్తినగర్, సంజయ్‌నగర్, దుమ్ములపేట, జగన్నాథపురం ప్రాంతాల్లో గజం ధర రూ.17వేలు ఉండగా, పెరిగిన ధరల ప్రకారం రూ.20వేలకు చేరింది. రామారావుపేట, అశోక్‌నగర్ ప్రాంతాల్లో గజం ధర రూ.3వేలనుంచి రూ.31వేలకు పెరిగింది. స్పెషల్ రివిజన్ సమయంలో వార్ఫ్ రోడ్ పాత బస్టాండ్ ప్రాంతం, జగన్నాథపురం, నరసింహరోడ్ ప్రాంతాల్లో వాణిజ్య భూములు ధర గజం రూ.42వేలు చేయగా ఈ ప్రాంతాల పడమర వైపు నివాసిత భూముల ధరను రూ.20వేలకు తగ్గించారు. వాణిజ్య ప్రాంతాలైన మెయిన్‌రోడ్, భానుగుడి ప్రాంతాల్లో గజం ధర రూ.95వేలు ఉండగా పెరిగిన ధరల ప్రకారం రూ.లక్షా10వేలకు చేరింది. ఏటిమొగ శివారులో గజం ధర రూ.5వేలుగా నిర్ధారించారు. గతంలో స్పెషల్ రివిజన్‌లో పెంచిన ధరలను పరిగణనలోకి తీసుకుని ఆయా ప్రాంతాల్లో స్వల్పంగా పెంచారు. కొన్ని ప్రాంతాల్లో ధరలను తగ్గిస్తూ సవరించారు.

సర్వర్ పనిచేయక ఇక్కట్లు..

భూముల ధరలు పెరిగిన నేపథ్యంలో కాకినాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రెండు రోజులుగా కక్షిదారులతో కిటకిటలాడుతోంది. గురువారం 113 రిజిస్ట్రేషన్‌లు కాగా, శుక్రవారం 100 వరకు చేరాయి. సర్వర్ సమస్యవల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యం అవుతుండడంతో కక్షిదారులు, లేఖర్లు పడిగాపులు పడుతున్నారు. ప్రజలనుంచి అభ్యంతరాలు వచ్చిన ప్రాంతాల్లో కాకినాడ సబ్ రిజిస్ట్రార్-1 రామారావు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. వార్ఫ్‌రోడ్ వెంబడి పాతబస్టాండ్, వెంకటేశ్వరనగర్, జగన్నాథపురం నరసింహరోడ్ కృష్ణనగర్ తదితర వెనుకబడిన ప్రాంతాల్లో భూమల ధరలు తగ్గించారు. గత ప్రభుత్వం చేపట్టిన స్పెషల్ రివిజన్ సమయంలో ఈ ప్రాంతాలను వాణిజ్యప్రాంతాలుగా చేరుస్తూ అధికంగా ధరల విలువ పెంచారు. ఇప్పుడు ఈ ధరలను తగ్గిస్తూ పేదలకు ఊరట కల్పించారు.

రాత్రి వరకూ కొనసాగిన రిజిస్ట్రేషన్లు

- జిల్లావ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద రద్దీ

పిఠాపురం/సామర్లకోట/సర్పవరం జంక్షన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): భూములు, స్థలాల రిజిస్ట్రేషన్ల ధరలు పెరగనున్న నేపథ్యంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద రద్దీ పెరిగింది. శుక్రవారం రాత్రి వరకూ రిజిస్ట్రేషన్లు కొనసాగుతూనే ఉన్నాయి. రాత్రయినా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బంది రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిర్వహించారు.పిఠాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతోపాటు అన్ని ప్రాంతాల్లో 10శాతం నుంచి 20శాతం వరకూ మార్కెట్ విలువ పెరుగుతోంది. దీంతో స్థలాలు, భూములు కొనుగోలు చేసిన వారు శుక్రవారమే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుకు తరలివచ్చారు. కార్యాలయం పనివేళలు ముగిసినా రాత్రివరకూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ఉండి ప్రక్రియను పూర్తి చేశారు. పిఠాపురంలో సాధారణ రోజుల్లో 15 నుంచి 20 వరకూ రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. గురువారం 66, శుక్రవారం 80 వరకూ రిజిస్ట్రేషన్లు జరిగాయి.

సామర్లకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి వరకూ క్రయవిక్రయదారులు రిజిస్ట్రేషన్లకు పడిగాపులు కాశారు. గురువారం నుంచి రిజిస్ట్రేషన్లకు రద్దీ ఉండగా శుక్రవారం ఆన్‌లైన్ సర్వర్‌లో సాంకేతిక లోపం కారణంగా ఇబ్బందులు నెలకొన్నాయి. సాయంత్రం 5గంటల తర్వాత సర్వర్ యథావిధిగా పనిచేయడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగింది. సామర్లకోటలో గురువారం 94 రిజిస్ట్రేషన్లు జరగ్గా శుక్రవారం రాత్రి వరకూ 60 రిజిస్ట్రేషన్లు జరిగాయి.



సర్పవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రాత్రి 7 గంటలకు కక్షిదారుల రద్దీ

కాకినాడ రూరల్ సర్పవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద భారీగా రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ప్రజలు బారులు తీరారు. రెండు రోజులుగా భారీగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తరలివచ్చి ఆస్తుల రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. సర్పవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సాధారణంగా రోజుకు 20నుంచి 60 వరకు రిజిస్ట్రేషన్లు జరిగేవి. గురువారం 31, శుక్రవారం రాత్రి 9గంటలకు 65 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు.

కరప సొసైటీ ఇన్‌చార్జ్ సీఈవో ఆత్మహత్య

- కాకినాడలోని లాడ్జిలో ఉరేసుకుని బలవన్మరణం
- చేయని తప్పుకు ఇరికించారని మృతుడి సూసైడ్ నోట్
- సొసైటీ సొమ్ములు దుర్వినియోగంపై విచారణ
- తిరిగి కట్టాలని అధికారులు ఒత్తిడి చేయడమే మూర్తి చావుకు కారణమా..?

7

వ్యక్తిగత కారణాలతో.. వృద్ధ దంపతుల ఆత్మహత్య

7

గన్ మిస్‌ఫైరా..? ఆత్మహత్యా..?

7

- తణుకు రూరల్ ఎస్ఐ మూర్తి మరణంపై భిన్న వాదనలు

భ్రూణ హత్యలు నివారించాలి: కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 31(ఆంధ్రజ్యోతి): భ్రూణ హత్యలను నివారించడంతో పాటు డివిజన్ స్థాయిలో లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీశిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థలు, జిల్లా లెవెల్ మల్టీ మెంబర్, అప్రోప్రియెట్ అథారిటీ, జిల్లా లెవెల్ అడ్వైజరీ కమిటీ ప్రతినిధులతో కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడశిశువుపట్ల వివక్షతతో జరిగే భ్రూణహత్యలను నివారించాలన్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖధికారి నరసింహ నాయక్ మాట్లాడుతూ గర్భస్థపిండఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగంకాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాస్థాయిలో గుర్తింపు పొందిన 157 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. డీఎల్, ఏటీవో రమేష్,డీఐవో సుబ్బరాజు, డీసీహెచ్ఎస్ స్వప్న, డిప్యూటీ డీఎంహెచ్‌వో సరిత, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీచ్ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),జనవరి31(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలంలోని వాకలపూడిలో ఉన్న బీచ్‌పార్కు సందర్శకులకు అనువుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కాకినాడ కమిషనర్ భావన, జిల్లా జేసీ రాహుల్‌మీనాతో కలిసి పంచాయతీ, పర్యాటకశాఖ, జిల్లా ప్రజా పరిషత్, కూడ తదితరశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చుట్టుపక్కల ప్రాంతాలనుంచి కాకినాడ బీచ్‌ను అనేక వేలమంది సందర్శిస్తూ ఉంటారన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సముద్రతీర ప్రాంతాలను అభివృద్ధి చేయనుందన్నారు. బీచ్‌ప్రాంతాన్ని సుందరంగా, శుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ రహిత, పర్యావరణ సహిత, క్లీన్ అండ్ గ్రీన్‌గా బీచ్‌పార్కు ఉండేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. శిల్పారామం, బీచ్ ఫ్రంట్ ప్రాంతాల్లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారివివరాలు నివేదిక సిద్ధం చేయాలన్నారు. జడ్పీ సీఈవో లక్ష్మణరావు, సీపీవో త్రినాథ్, పర్యాటకఅధికారి పోశయ్య, ఏటీవో త్రిమూర్తులు, ఏపీటీడీసీ ఏఈ వెంకటేష్ పాల్గొన్నారు.

పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్‌కు ప్రణాళికలు: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని ప్రాంతాల ఆర్థిక అభివృద్ధి, పేదరిక నిర్మూలనకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ షాన్‌మోహన్ అధ్యక్షతన తాత్కాలికంగా నియమించిన అధికారులతో పాడా తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం చుట్టుపక్కల ప్రాంతాల ఆర్థికాభివృద్ధి, పేదరిక నిర్మూలనకు నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించి ప్రజల జీవన ప్రమాణాలను పెంచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పిఠాపురం ప్రాంత అభివృద్ధి అథారిటీ సంస్థ ఏర్పాటు చేసిందన్నారు. పాడాపరిధిలో పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మూడు మండలాల్లో 52 గ్రామపంచాయతీలు, పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీలు ఉన్నాయన్నారు. 17శాఖల ద్వారా జరుగుతున్న వివిధ కార్యకలాపాలను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులను వేగవంతంచేసేలా కృషి చేయాలన్నారు. జేసీ రాహుల్‌మీనా, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, పాడా పీడీ ఎస్సీసీ శ్రీధర్, ఏపీడీ వసంతమాధవి, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.



వాడపల్లిలో డ్రాగన్ ఫ్రూట్



» ఇసుక, మట్టి నేలల్లోనూ సాగు » లాభాలు ఆర్జిస్తున్న రైతులు

ఆత్రేయపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చైనాలో పండే డ్రాగన్ ఫ్రూట్స్ పచ్చని కోనసీమలో రైతులకు కాసుల పంట పండిస్తోంది. ఉభయ గోదావరి జిల్లాల్లో రైతులు ఈ పంటను సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. గత కొన్నేళ్లుగా డ్రాగన్ ఫ్రూట్‌ను ప్రజలు బాగా వినియోగిస్తున్నారు. ఇది ఆరోగ్యప్రదాయిని కావడంతో ఎంత ధరైనా పెట్టి కొనుక్కుని ఎంతో ఇష్టంగా తింటున్నారు. ప్రస్తుతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని ఇసుక, మట్టి నేలల్లో ఈ పంట బాగా పండడంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 28వేల ఎకరాల్లో రైతులు ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నారు. వాడపల్లికి చెందిన యేపుగంటి సతీష్ 1.50 సెంట్లలో ప్రయోగాత్మకంగా డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తూ అధిక లాభాలు ఆర్జిస్తున్నాడు. ఉద్యానవన పంటలకు ప్రకృతి విపత్తులతో నష్టాలు ఎదురవుతున్నాయి. అయితే డ్రాగన్ ఫ్రూట్ పంటకు విపత్తుల నుంచి ఎటువంటి ప్రమాదం లేకపోవడంతో మిగిలిన రైతులు కూడా ఈ పంటను పండించేందుకు సమయాత్తమవుతున్నారు. ఎకరాకు రూ.8 లక్షలు ఖర్చు అవుతుంది. ఏడాదిన్నరలోగా పంట చేతికొస్తుంది. సుమారు ఆరేళ్ల పాటు ఫ్రూట్స్ కాస్తాయి. రైతులు తోటలో కిలో రూ.120 నుంచి రూ.150 వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. వేసవిలో డ్రాగన్ ఫ్రూట్ పంటకు ఉష్ణోగ్రత చల్లగా ఉండాలి. పంట తడిసేలా డ్రిప్ సౌకర్యం కల్పించాలి. డ్రిప్ ఇరిగేషన్‌కు రాయితీలను అందిస్తున్నారు.



దిగుబడి అధికం

యేపుగంటి సతీష్, రైతు, వాడపల్లి

ఎకరంన్నర పొలంలో డ్రాగన్ ఫ్రూట్ పండించాం. రూ.8 లక్షల వరకు పెట్టుబడి పెట్టాం. పంట దిగుబడి ఆశాజనకంగానే ఉంది. ఆదాయం కూడా బాగుంది. మరింత మంది రైతులు ఈ పంట సాగుకు ముందుకు వస్తున్నారు.



వాడపల్లి తోటలో రైతులు పండించిన డ్రాగన్ ఫ్రూట్స్

డ్రిప్, పైపులకు 90 శాతం రాయితీ

జి.కోటేశ్వరరావు, ఉద్యానవన శాఖాధికారి, కొత్తపేట



డ్రాగన్ ఫ్రూట్ పంట ఎండ వేడి నుంచి తట్టుకునేందుకు ఉష్ణోగ్రత చల్లగా ఉండాలి. ఈ సాగు చేపట్టే రైతులకు డ్రిప్, పైపు, స్తంభాలకు ప్రభుత్వం 90 శాతం రాయితీ అంటే సుమారు రూ.3లక్షలు అందిస్తుంది. దీంతో సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.



ఈవో సుబ్బారావుకు విరాళం అందజేస్తున్న దాత నరేష్‌బాబు

హరిహరసదన్ కాటేజీకి రూ.5 లక్షలు విరాళం

అన్నవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మితమైన హరిహర సదన్ కాటేజీకి శుక్రవారం సికింద్రాబాద్‌కు చెందిన చేకొండ నరేష్‌బాబు, విజయ, కుటుంబసభ్యులు రూ.5 లక్షలు విరాళాన్ని ఈవో సుబ్బారావుకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులను ఈవో అభినందించి స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి, ప్రసాదాలు అందజేశారు. సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన సీహెచ్.విఘ్నేశ్వరరావు రూ.1.80 లక్షలు విరాళం అందజేశారు.




హోమ పూర్ణాహుతిలో పాల్గొన్న ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్

వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీ హోమం

అన్నవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీ హోమం ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు పండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణ, మూలమంత్ర జపాలు పఠించారు. పదకొండు గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను మంత్రపూర్వకంగా అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ప్రస్తుతం ఏలూరు జిల్లాలో ఉన్న కుక్కునూరు సమీపంలో నాడు గోదావరిపై జలమార్గ సాధ్యాసాధ్యాలపై సర్వే చేస్తున్న దృశ్యం (పాత చిత్రం)



సర్వేతోనే సరి

గో...దారేదీ!

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

జాతీయ జలమార్గం సర్వేతోనే సరిపెట్టుకుంది. సరిగ్గా పన్నెండేళ్ల క్రితం పడ్డ అడుగులు అక్కడే ఆగిపోయాయి. ఆ మేరకు చేపట్టిన సర్వే వ్యయం రూ.కోటి వృథా అయ్యింది. గోదావరిపై జల మార్గానికి 2013లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రోడ్డు మార్గానికి ప్రత్యామ్నాయంగా జలమార్గ వినియోగం లాభదాయకమని భావించింది. ప్రధానంగా సరుకు రవాణా సులభతరమవడం, వ్యయ భారం తగ్గడం, రోడ్లపై ట్రాఫిక్ రద్దీ నియంత్రణ కూడా సాధ్యమేనన్న ఆలోచనే ఈ నిర్ణయానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం వయా వెలేరుపాడు, కుక్కునూరు, వరరామచంద్రపురం మధ్య ఉన్న 171 కి.మీ., భద్రాచలం నుంచి నాసిక్ వరకు ఉన్న 1,184 కి.మీ. నదీ జలాలపై సర్వే కూడా పూర్తయింది. అదే దశలో గోదావరి ఏలూరు కెనాల్ (రాజమహేంద్రవరం నుంచి ఏలూరు) 74 కి.మీ., కృష్ణా ఏలూరు కెనాల్ (ఏలూరు నుంచి విజయవాడ వరకు) 65 కి.మీ., మేర జల రవాణాను సుగమం చేయాలని నాడు భావించారు. సర్వే తంతుని ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించడం.... ఆపై కేవలం నెలలోనే సర్వే పూర్తిచేయడం చకచకా జరిగిపోయింది. సర్వేలో గోదావరి లోతు, అడుగు భాగంలో ఉన్న ఇసుక, పెద్ద రాళ్ల గుర్తింపుతో పాటు గోదావరి ప్రవాహ వేగంపై అధ్యయనం జరిగింది. ఆ మేరకు ఆధునిక

రూ.కోటి వ్యయం వృథా

పరిజ్ఞానమైన జీపీఎస్, హైడ్రోలాజికల్, టోపోగ్రాఫికల్ పద్ధతులు వినియోగించిన సంస్థ రాజమహేంద్రవరం నుంచి నాసిక్ వరకు జల మార్గం సాధ్యమేనని తేల్చిచెప్పింది. వాస్తవానికి భద్రాచలం, చింతూరు డివిజన్ల నుంచి రాజమహేంద్రవరానికి జలమార్గం కొత్తేమీ కాదు. ఐదున్నర దశాబ్దాల క్రితం భద్రాచలం, చింతూరు ఏజెన్సీ దట్టమైన అడవులతో వెనుకబడిన ప్రాంతాలుగా ఉండేవి. నాడు రాజమహేంద్రవరం నుంచే కుక్కునూరు, వెలేరుపాడు, కూనవరం, వరరామచంద్రపురం, చింతూరు మండలాలతో పాటు తెలంగాణ రాష్ట్రం భద్రాచలం డివిజన్లోని దుమ్ముగూడెం, వెంకటాపురం మండలాలకు నిత్యావసర వస్తువులతో పాటు వ్యవసాయ పరికరాలు, ఎరువులు, డీజిలు తదితర సామగ్రి లాంచీల ద్వారానే దిగుమతి అయ్యేవి. తర్వాత ఇక్కడ పండించిన పంటలను రాజమహేంద్రవరానికి లాంచీల ద్వారానే ఎగుమతి చేసేవారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి కలప, వెదురులను గోదావరి మీదుగానే రాజమహేంద్రవరం చేర్చేవారు. దీంతో నిత్యం లాంచీల రాకపోకలు సాగేవి. నాటి కాలంలో భద్రాచలం నుంచి రాజమహేంద్రవరం లాంచీపై ప్రయాణం చేయడానికి ఒక్కో వ్యక్తికి రూ.3 నుంచి రూ.5 టికెట్ ఉండేది. కాగా ఈ జలమార్గం సర్వేతోనే సరిపెట్టుకోవడంతో ముందుకు సాగకుండా పోయింది.

అర్ధరాత్రి ఒంటి గంట నుంచే వ్రతాలు

- వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్ వ్యవస్థ
- ఎక్కడికక్కడ హోల్డింగ్ పాయింట్లు
- అన్నవరంలో భీష్మ ఏకాదశి, మాఘపౌర్ణమి ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం



సమీక్షలో పాల్గొన్న అన్నవరం దేవస్థానం ఈవో, చైర్మన్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది

అన్నవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8వ తేదీన భీష్మ ఏకాదశి, 12వ తేదీ మాఘ పౌర్ణమి సందర్భంగా సత్యదేవుని సన్నిధికి విచ్చేసే భక్తుల సౌకర్యాల కల్పనపై శుక్రవారం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా భీష్మ ఏకాదశి పర్వదినాన సుమారు 80వేల మంది భక్తులు విచ్చేస్తారని, 12 నుంచి 15 వేలు వ్రతాలు జరుగుతాయని అంచనా వేస్తూ దానికణుగుణంగా ఏర్పాట్లపై దృష్టిసారించారు. అర్ధరాత్రి 12 గంటలకు వ్రతం టిక్కెట్లు విక్రయించి ఒంటి గంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించాలని నిర్ణయించారు. కార్తీకమాసంలో రద్దీకి తగినట్టు చేసిన ఏర్పాట్ల కంటే మిన్నగా సౌకర్యాల కల్పనపై దృష్టిసారించాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్ వ్యవస్థ ఉండేలా చూడాలని ట్రాఫిక్‌ను సత్యగిరి కొండపైకి మళ్లించి ఉచిత వాహనాల ద్వారా భక్తులను రత్నగిరికి చేర్చాలని నిర్ణయించారు. ఎక్కడా తొక్కిసలాటలు జరగకుండా క్యూలైన్లు పటిష్ఠపరిచి, ఎక్కడికక్కడ హోల్డింగ్ పాయింట్లను ఏర్పాటుచేసి రద్దీ ఆధారంగా క్యూలైన్ల ద్వారా భక్తులను వ్రతాలు, దర్శనాలకు అనుమతించాలని నిర్ణయించారు. సిబ్బంది అంతా సమన్వయంతో ముందుకెళ్లాలని ఈవో సూచించారు. భక్తులకు ఉచిత పులిహోర, దద్దోజన ప్రసాదాన్ని ఉదయం 8గంటల నుంచి ప్రారంభించాలని ఆదేశించారు. ప్రోటోకాల్ వ్యక్తుల దర్శనాలు, సామాన్య భక్తుల దర్శనాలు ఎవ్వరికీ ఇబ్బంది కలగకుండా అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు సీఐ సూరిఅప్పారావు, ఎస్ఐ హరిబాబు, సర్పంచ్ కుమార్‌రాజా, దేవస్థానం ఏఈవోలు కొండలరావు, కృష్ణారావు, జగ్గారావు, సూపరింటెండెంట్‌లు బలువు సత్యశ్రీనివాస్, అనకాపల్లి ప్రసాద్, ఐవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో శిశు ఆధార్ సేవలు

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో శిశు ఆధార్ సేవలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గైనిక్ విభాగంలోని బర్త్ రిజిస్ట్రేషన్ వార్డులో ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డా.ఎన్.రాజకుమారి రిజిస్ట్రార్‌గా వ్యవహరించనున్నారు. జీజీహెచ్ మెడికల్ రికార్డు విభాగం సెక్షన్ ఆధ్వర్యంలో ఈ సేవలు అందనున్నాయి. శిశువు పుట్టిన వెంటనే ఆధార్ కార్డు మంజూరు చేయడం ఈ పథకం లక్ష్యం. ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డా.శ్రీనివాసన్, అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టర్ ఎస్.శ్రీధర్, గైనిక్ హెచ్‌వోడి డా.అనురాగమయి, ఎంఆర్‌డీ, ఎంఆర్‌వో జయచంద్ర పాల్గొన్నారు.

పీఏడీఏ పీడీగా శ్రీధర్

డిప్యూటీ కలెక్టర్, కాకినాడ జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.శ్రీధర్‌ను పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పీఏడీఏ) పీడీగా నియమిస్తూ కలెక్టర్ షాన్‌మోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆరుగురు అధికారులను కలెక్టర్ ఈ విధానంలో నియమించారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు

108 రకాల పిండి వంటలతో నైవేద్యం



అమ్మవారికి నివేదించిన 108 రకాల వంటలు

అన్నవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవమైన వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించకుని శుక్రవారం గ్రామంలో వాసవీమాత ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి 108 రకాల పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ విచ్చేసి పూజల్లో పాల్గొన్నారు. ముందుగా ఉదయం 10గంటలకు గ్రామంలో వైశ్యులు వ్యాపార సముదాయాలను మూసివేసి అమ్మవారిని పల్లకీలో ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించి జై వాసవీ నినాదాలతో హోరెత్తించారు. వాసవీక్లబ్, వనితాక్లబ్, ఆర్య వైశ్య సంక్షేమసమాజం ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధికసంఖ్యలో గ్రామస్థులు అమ్మవారిని దర్శించారు. ఎమ్మెల్యే సత్యప్రభ వాసవీమాత గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో వాసవీ, వనిత క్లబ్ నాయకులు దాసరి గౌతమి, అమరా వీరలక్ష్మి, దాసరి రజనీ, పులవర్తి నవీన్, దాసరి కుమార్, విహారి, సంఘనాయకులు దాసరి ప్రసాద్, శంకర్, గణపతి, జొన్నాడ రాజేష్, బోనగిరి శ్రీనివాస్, కడిమిశెట్టి సతీష్ ఉన్నారు.



ఎమ్మెల్యే సత్యప్రభకు స్వాగతం పలుకుతున్న మహిళలు

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో రజత పతకం



రజత పతకంతో నరాల లక్ష్మీ

కాకినాడ రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెనికి చెందిన నరాల లక్ష్మీ అనే క్రీడాకారిణి హైదరాబాద్ యూసఫ్ గుడా కోట్ల విజయభాస్కరరెడ్డి స్టేడియంలో జరిగిన 40వ జాతీయ స్థాయి క్యోర్ యుగి, 13వ జాతీయ సీనియర్ పూమ్సే తైక్వాండో చాంపియన్‌షిప్ 2024-25 పోటీల్లో ప్రతిభ కనబరచి రజత పతకం సాధించింది. బీసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న లక్ష్మీ ఈనెల 28 నుంచి 30 వరకూ జరిగిన తైక్వాండో సీనియర్ క్యోర్‌యుగి, పూమ్సే కేటగిరిలో ఈ పతకాన్ని గెలుపొందగా.. గతంలో రాష్ట్ర, జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో రాణించి ప్రథమస్థానంలో నిలిచి స్వర్ణ పతకాలు పొందింది. తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో ఈ పోటీలు జరిగాయి. సీనియర్ ఉమెన్ అండర్ 73 కిలోల విభాగంలో ఈ ఘనత సాధించింది. సిల్వర్ పతకాన్ని సాధించిన లక్ష్మీని గ్రామంలోని వివిధ రాజకీయపార్టీల నాయకులు, పెద్దలు అభినందించారు. లక్ష్మీ మాట్లాడుతూ తైక్వాండో మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచుతుందని, ప్రతీ ఒక్కరూ ప్రోత్సహించాలని కోరింది.

నేడు దంటు కళాక్షేత్రంలో భూతకాలం నాటకం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 31(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని దంటు కళాక్షేత్రంలో గోవాడ క్రియేషన్స్ అసోసియేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం భూతకాలం నాటకం ప్రదర్శిస్తామని దంటు కళాక్షేత్రం అధ్యక్షులు దంటు భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దంటు కళాక్షేత్రం గౌరవ సలహాదారుడిగా పనిచేస్తూ ఇటీవల మరణించిన డీవీఎస్ శర్మ, ప్రముఖ సంగీత దర్శకులు జి.సర్వేశ్వరరావుకు నివాళులర్పిస్తూ ఈ నాటకం ప్రదర్శిస్తామన్నారు. తొలుత డీవీఎస్ శర్మ సంతాప సభ జరుగుతుందని తెలిపారు.

జాతీయస్థాయి హాకీ టోర్నమెంట్

విజయవంతానికి ప్రత్యేక కమిటీలు

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 15 నుంచి 28 వరకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అంశాలవారీగా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో హాకీ టోర్నమెంట్ నిర్వహణ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయిలో జరిగే ప్రతిష్ఠాత్మకమైన టోర్నమెంట్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆయా అంశాలవారీగా వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, జాయింట్ కలెక్టర్, డీఆర్వో, సీపీవో, డీఎస్‌డీవోలు సభ్యులుగా ఏర్పాటు చేసిన ఆర్గనైజింగ్ కమిటీ, వివిధ ఉప కమిటీల సహకారంతో టోర్నమెంట్ నిర్వహణ అన్ని అంశాలపై పర్యవేక్షిస్తుందన్నారు. డీటీసీ నేతృత్వంలో ట్రాన్స్‌పోర్టు, రిసెప్షన్ కమిటీ క్రీడాకారులకు స్వాగతం, రవాణా, బస సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు.డీడీ-గ్రౌండ్ వాటర్ నేతృత్వంలో రిజిస్ట్రేషన్ కమిటీ పాల్గొనేందుకు వచ్చిన టీముల రిజిస్ట్రేషన్ కమిటీ పాల్గొనేందుకు వచ్చిన టీముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించి వారికి అవసరమైన ఏర్పాట్ల కోసం మిగిలిన సబ్ కమిటీలకు సూచించాలన్నారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డీయం నేతృత్వంలో ఫుడ్ కమిటీ క్రీడాకారులకు ఆహార ఏర్పాట్లను, కాకినాడ ఆర్డీవో నేతృత్వంలోని అకామిడేషన్ కమిటీ క్రీడాకారులకు బస ఏర్పాట్లను, ఏపీసీ సమగ్రశిక్ష నేతృత్వంలో టెక్నికల్ కమిటీ పోటీల నిర్వహణకు సంబంధించిన సాంకేతిక అంశాలను, డీఎంహెచ్‌వో నేతృత్వంలోని మెడికల్ కమిటీ కీడాకారులకు ప్రథమ చికిత్స, అంబులెన్స్ సేవలను నిర్వహించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన, డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి పాల్గొన్నారు.

8 నుంచి వ్యాయామ ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు

కాకినాడ అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు ఫిబ్రవరి 8 నుంచి 10 వరకు రాష్ట్రస్థాయి సెమినార్, క్రీడా పోటీలు కాకినాడ డీఎస్ఏ మైదానంలో జరుగుతాయని వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘ ఉమ్మడి తూర్పుగోదారి జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆసక్తిగల ఉపాధ్యాయులు ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు కాకినాడ డీఎస్ఏలో జరిగే ఎంపికల్లో పాల్గొనాలన్నారు. వివిధ క్రీడల్లో మహిళ, పురుష క్రీడాకారులకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తారని రాష్ట్ర సంఘ అధ్యక్షుడు లంకా జార్జి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నూకరాజు, కోశాధికారి జి.రవికౌర్ పాల్గొన్నారు.

వాహనాల సామర్థ్య పరీక్ష సెంటర్ ప్రారంభం



వాకలపూడిలో ప్రారంభమైన సెంటర్

సర్పవరం జంక్షన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా వాకలపూడి ఏడీబీ రోడ్డులో కంట్రోల్ ఆల్ట్ ఫిక్స్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఆటోమేటెడ్ సామర్థ్య పరీక్షల సెంటర్ (ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్)ను ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు చెరుకూరి కిరణ్, పొట్లూరి బుజ్జిబాబు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రోడ్డు ట్రాన్స్‌పోర్టు వాహనాలు పూర్తి ఫిట్‌గా ఉండాలన్న లక్ష్యంతో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ దేశవ్యాప్తంగా ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్‌స్టేషన్లు మంజూరు చేసిందన్నారు. ఇందులో ఏపీలో 22 సెంటర్లు మంజూరు కాగా తమ సంస్థ ఆధ్వర్యంలో అనకాపల్లి, రాజమహేంద్రవరంతో పాటూ వాకలపూడిలో ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్లు ప్రారంభించడం జరిగిందన్నారు. ఒకేసారి 4 వాహనాలకు టెస్టింగ్ సామర్థ్యంతో ఈ సెంటర్ ప్రారంభించామన్నారు. ఒక్కో వాహనానికి 20 నిమిషాల సమయం పడుతుందన్నారు. టెస్టింగ్ అనంతరం ఆన్‌లైన్‌లో జారీ చేసిన సర్టిఫికెట్‌ను యాజమానికి అందివ్వడం జరుగుతుందన్నారు. అన్ని రకాల వాహనాలకు సుమారు 36 రకాల ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించేందుకు అవసరమైన అనుమతులను కేంద్రం నుంచి పొందడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సలహా మండలి సభ్యులు మేకా లక్ష్మణరావు, ఆదినారాయణ, మీసాలరాజు, పలువురు వాహన యాజమానులు పాల్గొన్నారు.

కరప సొసైటీ ఇన్‌చార్జ్ సీఈవో ఆత్మహత్య





కాకినాడలోని లాడ్జిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ కరప సొసైటీ సీఈవో నక్కా నారాయణమూర్తి

మృతుడు నారాయణమూర్తి(ఫైల్)

- కాకినాడలోని లాడ్జిలో ఉరేసుకుని బలవన్మరణం
- చేయని తప్పుకు ఇరికించారని మృతుడు నారాయణమూర్తి సూసైడ్ నోట్
- సొసైటీ సొమ్ములు దుర్వినియోగంపై విచారణ
- తిరిగి కట్టాలని అధికారులు ఒత్తిడి చేయడమే మూర్తి చావుకు కారణమా..?

కరప, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కరప సొసైటీ ఇన్‌చార్జ్ సీఈవో నక్కా నారాయణమూర్తి (27) అకస్మాత్తుగా బలవన్మరణానికి పాల్పడ డంతో గ్రామం లో విషాదఛాయలు అలముకున్నాయి. ఎప్పు డూ చలాకీగా ఉంటూ..అందరితో కలుపుగోలుతనంగా వ్యవహరించే మూర్తి ఆత్మ హత్య చేసుకోవడాన్ని ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. మూర్తి తండ్రి వీరబాబు టీడీపీ సీనియర్ నా యకుడు కాగా ప్రస్తుతం చిరువ్యాపా రం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చేతికందివచ్చి న కుమారుడు, వివాహం చేయాలనుకుంటున్న తరుణంలో అకాల మరణం చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.





రోధిస్తున్న కుటుంబసభ్యులు, కాకినాడ లాడ్జి ఎదురుగా రోడ్డుపై బైఠాయించి ఆందోళనచేస్తున్న బాధితులు

సొసైటీ సొమ్ములు దుర్వినియోగంపై విచారణ

కరప ఇన్‌చార్జ్ సీఈవోగా గత ఏడాది సెప్టెంబరులో నారాయణమూర్తి బాధ్యతలు తీసుకున్నారు. కాగా సొసైటీలో రుణాలు తీసుకున్న కొంతమంది రైతులు ఇటీవలె ఆ తీసుకున్న బాకీలను తిరిగి కట్టారు. అయితే వారిలో ఒక రైతు లోను సొమ్ము జమయ్యిందా అని స్థానిక కో-ఆపరేటివ్ బ్రాంచ్‌లో కట్టిన రసీదును అధికారులకు చూపించినట్టు తెలిసింది. రికార్డులో ఆ సొమ్ము కట్టినట్టులేకపోవడంతో అనుమానం వచ్చిన కో-ఆపరేటివ్ బ్యాంక్ అధికారులు సొసైటీలోని ఎల్‌టీ, ఎస్‌టీ, రైతునేస్తం, తదితర రికార్డులను పరిశీలించగా పెద్దమొత్తంలో రుణాల సొమ్ము పక్కదారి పట్టినట్టు తేలింది. దీనికి మూర్తిని బాధ్యుడిని చేస్తూ వెంటనే ఆ సొమ్ములు చెల్లించాలని అధికారులు పట్టుబట్టినట్టు సమాచారం. అంతవరకు ఇన్‌చార్జ్ సీఈవోగా జడ్.బావారం సీఈవో వెంకటేశ్వరరావుకు బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. సీఈవోగా తనను తప్పించడం, చేయని తప్పుకు బాధ్యుడ్ని చేయడం అవమానంగా భావించి నారాయణమూర్తి ఆత్మహత్యకు పాల్పడినట్టుగా సన్నిహితులు చెబుతున్నారు. దీనిపై కరప సొసైటీ స్పెషలాఫీసర్ దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా రికార్డుల ప్రకారం రూ.12లక్షల వరకు సొసైటీ సొమ్ములు దుర్వినియోగమైనట్టుగా విచారణలో తేలిందన్నారు. అందులో కొంత సొమ్ము రికవరీ అయ్యిందని, మిగిలిన సొమ్ములను కట్టమని మూర్తి కుటుంబ సభ్యులకు సూచించామని, ఇంతలో ఇలా జరగడం దారుణమని ఆయన విచారం వ్యక్తంచేశారు.

'ఎమ్మెల్యే గారు మా ఫ్యామిలీకి హెల్ప్ చేయండి'

అమ్మా, నాన్న, అక్క, బావ అందరూ కలిసి ఉండండి..మిత్రులారా లగ్జరీకి పోకుండా జాగ్రత్తగా ఉండండి.. నేనెవరికీ రూపాయి కూడా ఇవ్వక్కర్లేదు..చేయని తప్పుకు నన్ను ఇరికించారు...జనసేనకు సపోర్టు చేశానని చాలా బాధపెట్టారు. ఇప్పుడు జనసేన అధికారంలోకి వచ్చినా సుఖం లేదు. ఎమ్మెల్యేగారు మా ఫ్యామిలీకి ఏమైనా హెల్ప్ చేయండంటూ... నారాయణమూర్తి ఆత్మహత్య చేసుకోవడానికి ముందు రాసిన మూడు సూసైడ్ నోట్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

బంధువుల ఆందోళన

కాకినాడలోని లాడ్జి నిర్వాహకుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ మృతుడి బంధువులు, స్నేహితులు లాడ్జి ఎదురుగా రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. మృతిపై తమకు అనుమానాలున్నాయని, సీసీ టీవీ ఫుటేజీ ఇవ్వాలని లాడ్జి యాజమాన్యాన్ని వారు ప్రశ్నించారు. అంతవరకు మృతదేహాన్ని తరలించడానికి అంగీకరించమంటూ భీష్మించుకుని కూర్చున్నారు. సీసీ కెమేరాలున్నాయి గానీ, కొంతకాలంగా అవి పని చేయడంలేదని లాడ్జి నిర్వాహకులు చెప్పడంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. కాకినాడ టూటౌన్ పోలీసులు బాధితులతో మాట్లాడి శాంతింపజేయడంతో ఆందోళన విరమించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమి త్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశారు.

మండపేటలో రూ.30 కోట్లకు టోకరా?

- అటు భక్తిమార్గం.. ఇటు వడ్డీ వ్యాపారం
- అధిక వడ్డీ ఆశతో భారీగా అప్పులిచ్చిన మహిళా భక్తులు
- బోర్డు తిప్పేయడంతో బాధితులు లబోదిబో

మండపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భక్తిముసుగు లో మహిళా భక్తులే లక్ష్యంగా అధికవడ్డీ ఎరజూపి వారి వద్ద నుంచి లక్షలాది రూపాయలు సేకరించి ఏకంగా రూ.30 కోట్ల మేర బోర్డును తిప్పేసిన సంఘటన ఆలస్యంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేటలో వెలుగుచూసింది. మండపేటకు చెందిన ఒక వ్యక్తి గత కొంతకాలం నుంచి దేవుడు ముసుగులో భక్తులను ఆకర్షించి వారితో మండపేట పరిసర ప్రాంతాల్లో భజనలు, కీర్తనలు నిర్వహిస్తూ వస్తున్నా డు. అధిక వడ్డీ ఇస్తానని చెప్పడంతో చాలామంది మహిళా భక్తులు అతడిని నమ్మి తమ వద్ద ఉన్న నగదును ఇచ్చారు. దీంతో అటు భక్తి కార్యక్రమాలు, ఇటు వడ్డీ వ్యాపారం నిర్వహి స్తూ మహిళల నుంచి ఏకంగా రూ.30కోట్ల వరకు తీసుకున్నాడు. కొన్నాళ్లపాటు సక్రమంగా వడ్డీ ఇస్తూ వచ్చిన అతడు ఆకస్మికంగా జెండా ఎత్తేశాడు. ఇంట్లో తెలిసి కొందరు, తెలియకుండా కొందరు మహిళలు లక్షలాది రూపాయలను ఇతడికి ఇచ్చినట్టు సమాచారం. ఇప్పుడు ఆ వ్యక్తి కనిపించకపోవడం, ఫోన్ పనిచేయకపోవడంతో వీరంతా మోసపోయి నట్టు గ్రహించారు. పట్టణంలోని కొందరు పెద్దల వద్ద ఈ మోసాన్ని చెప్పి న్యాయం చేయాలని వేడుకోగా, మరికొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నట్టు తెలిసింది. సదరు వ్యక్తికి ఉన్న ఆస్తులకు, అప్పులకు ఏమాత్రం సంబంధం లేకుండా ఉండడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. కాగా ఈ వ్యక్తిపై ఎటువంటి ఫిర్యాదు పోలీసులకు అందలేదు. ఏదొక విధంగా సొమ్ములు వస్తాయనే ఆశతో పెద్దలవద్ద పంచాయతీ జరుగుతున్న నేపథ్యంలో వేచిచూసే ధోరణిలో ఉన్నారు. న్యాయం జరగకపోతే పోలీసులకు ఫిర్యాదు చేయాలని భావిస్తున్నారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



మృతుడు సూరాడ అప్పారావు

కొత్తపల్లి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన ఉప్పాడలో చోటుచేసుకొంది. మత్స్యకారులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరాడపేటకు చెందిన సూరాడు అప్పారావు(19) శుక్రవారం సహచర మత్స్యకారులతో వేటకు వెళ్లాడు. వేట సమయంలో సముద్రంలో కెరటాల ఉధృతికి వల లాగుతున్న అప్పారావు దురదృష్టవశాత్తు జారి సముద్రంలో పడి గల్లంతయ్యాడు. మత్స్యకారులు సాయంత్రం వరకు వలలతో గాలింపు చర్యలు చేపట్టడంతో అప్పారావు మృతదేహం వలకు చిక్కడంతో ఒడ్డుకు చేర్చారు. వేట ముగించు కుని త్వరగా ఇంటికి చేరుకుంటానన్న అప్పారావు మాట తలచుకొని కుటుంబ సభ్యులు విలపిస్తుంటే చూపరుల కంటతడిపెట్టించింది.

వ్యక్తిగత కారణాలతో..
వృద్ధ దంపతుల ఆత్మహత్య

- విదేశాల్లో స్థిరపడిన పిల్లలు..
- మానసిక ఒత్తిడితో కాకినాడ ఉప్పుటేరులోకి దూకి బలవన్మరణానికి పాల్పడిన దంపతులు

కాకినాడ క్రైం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురై కాకినాడ జగన్నాథపురం ఉప్పుటేరులోకి దూకి దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కాకినాడ జగన్నాథపురానికి చెందిన వృద్ధ దంపతులు ఎం.ఆదిమూర్తి(65), ధనలక్ష్మి(60) భార్యభర్తలు. కాగా వారి పిల్లలు విదేశాల్లో స్థిరపడడంతో ఆ వృద్ధ దంపతులు కాకినాడలో ఉంటున్నారు. వారిలో ఒకరు అనారోగ్యం పాలైతే మరొకరు వారి ఆలనాపాలనా చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విధంగా వారు మానసిక ఒత్తిడికి, శారీరక ఒత్తిడికి గురౌతున్న నేపథ్యంలో తీవ్రమనస్తాపానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో వారిద్దరూ మరణమే శరణ్యమని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం జగన్నాథపురం ఎన్‌టీఆర్ వారధి వద్దకు వచ్చి ఉప్పుటేరులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అనంతరం కుటుంబసభ్యులు విగతజీవులుగా మారిన ఆ వృద్ధ దంపతులను గుర్తించి మృతదేహాలను ఖననం నిమిత్తం స్వగృహానికి తరలించారు. ఈ విషయంపై కాకినాడ వన్‌టౌన్ సీఐ నాగదుర్గారావును వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, అందువల్ల కేసు నమోదు చేయలేదని తెలిపారు.

వివాహిత హత్యకేసులో
వీడిన మిస్టరీ

- పందలపాక హత్యకేసులో వ్యక్తి అరెస్టు
- వివాహేతర సంబంధమే కారణం

బిక్కవోలు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వివాహిత హత్యకేసులో మిస్టరీ వీడింది. తూర్పుగోదావరిజిల్లా బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన వివాహిత లలితేశ్వరి ఈనెల 29న ఆమె పనిచేస్తున్న బరకాల కొట్టులో మృతి చెందిన ఘటన విదితమే. దీనిపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ మేరకు శుక్రవారం అనపర్తి సీఐ సుమంత్ వివరాలు వెల్లడించారు. సంచుల కొట్టులో గుమస్తాగా పనిచేస్తున్న లలితేశ్వరికి అదే గ్రామానికి చెందిన గుంతికోలు దుర్గాప్రసాద్‌కు గత కొంతకాలంగా పరిచయం ఉంది. అయితే ఇటీవల లలితేశ్వరి దుర్గాప్ర సాద్‌ను దూరం పెట్టడంతో కోపం పెంచుకున్నాడు. ఇదిలావుండగా ఈనెల 29న తెల్లవారు జామున ఆమె పనిచేస్తున్న సంచుల కొట్టు వద్దకు పిలిచాడు. ఆమె వాకింగ్‌కు వెళుతున్నానని చెప్పి సంచుల కొట్టు వద్దకు వెళ్లింది. అక్కడే ఉన్న దుర్గాప్రసాద్ తనను దూరం పెట్టడంపై లలితేశ్వరితో వివాదానికి దిగాడు. ఈ వివా దం పెరిగి దుర్గాప్రసాద్ కేబుల్ వైరుతో మెడకు చుట్టి గట్టిగా నొక్కి చంపేసి పారిపోయాడు. ఈ మేరకు సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడైన దుర్గాప్రసాద్‌ను గురువారం రాత్రి 11 గంటలకు పందలపాక సెంటర్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని తెలిపారు. మృతురాలి హత్యకేసులో ఇంకా ఎవరైనా ఉ న్నారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అసలేం జరిగింది ?





కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు

తణుకు రూరల్ ఎస్ఐ మూర్తి మరణంపై భిన్న వాదనలు

ఆత్మహత్య చేసుకున్నాడు

- సోదరుడు, సోదరి

'చిన్నప్పటి నుంచి అనుకున్నది సాధించాలనే పట్టుదల ఉన్న వ్యక్తిత్వం తనది. ఇప్పటి వరకు జిల్లా కేంద్రంలో వున్న మూర్తిని, ఏలూరు రేంజిలో రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు చెప్పారు. దీంతో ఎక్కడ తనకు దూరంగా పోస్టు వస్తుందోనని భావించాడు. జరిగిన దానిని వదిలేయ్ మళ్లీ ఉద్యోగం వస్తుంది. ధైర్యంగా ఉండు. లేదంటే ఉద్యోగం వదిలేసి వచ్చేయమని చెప్పాం. ఉదయం స్టేషన్‌కు వెళ్లిన కొద్దిసేపటికే రివాల్వర్‌తో కాల్చుకుని చనిపోయాడు. పోలీసులు, మీడియా తీరు వల్లే ఇలా జరిగింది. సంబంధం లేని విషయాన్ని పెద్దభూతంలా చేశారు. ఇప్పుడు మనిషే పోయాడని సోదరుడు వెంకటేశ్, సోదరి శ్రీలక్ష్మి కన్నీరు మున్నీరుగా విలపించారు. 'మూర్తి ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదు. అతని ఫోన్ కాల్ లిస్టు బయటపెట్టాలి. అతని మృతిపై అనుమానాలు ఉన్నాయి. అధికారుల వేధింపులు ఉన్నాయా ? అనే విషయం తేలాలి. సెల్‌ఫోన్, వీడియోలు బయటపెట్టాలి' అని ఆయన స్నేహితుడు కె.గంగవరానికి చెందిన వెంకటరమణ డిమాండ్ చేశారు.

తణుకు/కె.గంగవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వీఆర్‌లో వున్న తణుకు రూరల్ ఎస్ఐ ఏజీఎస్ మూర్తి(38) మృతిపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మూర్తి ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు, బ్యాచ్‌మేట్స్, కుటుంబ సభ్యులు ఆరోపిస్తుంటే.. కాదు గన్‌మిస్ ఫైర్ అయ్యిందని జిల్లా ఎస్పీ నయీం అస్మి చెబుతున్నారు. కుటుంబ సభ్యులు, సహోద్యోగుల కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరానికి చెందిన ఆదుర్తి గోపాలరావు, తల్లి సూర్యావతిలకు ఇద్దరు కుమారులు వెంకటేశ్, మూర్తి, కుమార్తె శ్రీలక్ష్మి. మూర్తి టెన్త్ వరకు స్వగ్రామంలోనే చదివాడు. ఎంతో కష్టపడి 2012లో ఎస్ఐ ఉద్యోగం సాధించాడు. విజయలక్ష్మితో వివాహం కావడంతో వీరికి కుమారుడు చందన్(5) కుమార్తె హేమాన్షి (16 నెలలు) ఉన్నారు. పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని మచిలీపట్నం, కైకలూరు, భీమవరం టూ టౌన్, పాలకోడేరు, పెరవలి, నరసాపురం రూరల్, ఆచంట, తణుకు రూరల్ స్టేషన్‌లలో పనిచేశాడు. వేల్పూరులో రెండు గేదెల అపహరణ కేసులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో నాలుగు నెలలు క్రితం పోలీసు ఉన్నతాధికారులు వీఆర్‌లో పెట్టారు. అప్పటి నుంచి తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. తనకు సంబంధం లేని కేసులో వీఆర్‌కు పంపారని అవమానంగా భావించాడు. పెనుగొండలో సీఎం పర్యటనకు బందోబస్తుగా వెళ్లాలని ఆదేశాలు రావడంతో.. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు తణుకు రూరల్ పోలీసుస్టేషన్‌కు బైక్‌పై వచ్చాడు. కొంతసేపటికి సర్వీసు రివాల్వర్ తీసుకుని పక్కనే ఉన్న వాష్ రూమ్‌కు వెళ్లి కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ విషయం తెలియగానే ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన 2012 బ్యాచ్ ఎస్ఐలు పెద్ద ఎత్తున తణుకు ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. అందరికి ధైర్యం చెప్పే మూర్తి ఇలా ఎందుకు చేశాడోనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన పోలీసు శాఖలో కలకలం రేగింది. ఉన్నతాధికారుల నుంచి రకరకాల ఒత్తిళ్ల సిబ్బందిని కుంగిపోయేలా చేస్తున్నాయనే విమర్శలు వచ్చాయి.



స్టేషన్ వద్ద బంధువులు



ఎస్ఐ మూర్తి

రివాల్వర్ మిస్ ఫైర్ : ఎస్పీ నయీం



'ఎస్ఐ మూర్తి ఉదయం స్టేషన్‌కు వచ్చారు. అందరితోనూ మాట్లాడి వాష్ రూమ్‌కు వెళ్లారు. అక్కడ రివాల్వర్ మిస్ ఫైర్ అయ్యింది. దీనిని గమనించి సిబ్బంది 108లో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మూర్తి చనిపోయారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి వాస్తవాలు వెలుగులోకి తెస్తాం' అని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ నయీం అస్మి తెలి పా రు. ఆయన వెంట ఏఎస్పీ భీమారావు తదితరులున్నారు. ఎస్ఐ కుటుంబానికి న్యాయం చేస్తామని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. ఆసుపత్రిలో మూర్తి మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కోటిపల్లిలో శనివారం పోలీసు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు పామర్రు ఎస్ఐ ఎస్కే జానీ బాషా చెప్పారు.

ఆర్యవైశ్యులకు అండగా టీడీపీ ప్రభుత్వం

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడు కంచర్ల



తాటిపాకలో శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడు కంచర్ల బాబి

రాజోలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు అండగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడు కంచర్ల బాబి అన్నారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడు కంచర్ల బాబి ఆధ్వర్యంలో తాటిపాకలో శుక్రవారం ఆర్యవైశ్యులు వాసవీ అమ్మవారి నగర సంకీర్తన ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. జిల్లాలో బాబి పిలుపు మేరకు ప్రతీ గ్రామంలో, ప్రతీ మండలంలో ఉన్న ఆర్యవైశ్యులు ఎంతో భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. కొత్తపేట శ్రీ వాసవీ కల్యాణ మండపంలో వెలసిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి జిల్లా అధ్యక్షుడి హోదాలో బాబి పట్టువస్త్రాలు సమర్పించారు. అల్లవరం మండలం బోడసకుర్రులో కుంకుమ పూజలు చేశారు. అమ్మవారికి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలనచేసి వాసవీమాత సహస్రశ్లోకం పఠించారు. ఈ సందర్భంగా బాబి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా జీవో తీసుకువచ్చి అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, వాణిజ్య మంత్రి టీజీ భరత్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డి.రాకేష్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం కోశాధికారి కంచర్ల కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడు పోశెట్టి సూరిబాబు, అదనపు కార్యదర్శి కాసు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి లక్కింశెట్టి నానాజీ, యెండూరి పవన్‌కుమార్, గమిడి సూరిబాబు, పి.కృష్ణారావు, బాబి పాల్గొన్నారు.





రాజమహేంద్రవరంలోని పుష్కరాల రేవు వద్ద మానవహారం నిర్వహిస్తున్న పోలీసులు, ఫ్లెక్సీతో ర్యాలీ చేస్తున్న పోలీసులు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ

- తూర్పుగోదావరిజిల్లా పోలీస్ ఆధ్వర్యంలో మానవహారం

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో 200మంది పోలీసులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు ఈర్యాలీని స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు ప్రారంభించారు. ఈ ర్యాలీ అజాద్ చౌక్, దేవీచౌక్, గోకవరం బస్టాండ్ మీదుగా పుష్కరాల రేవువరకు సాగింది. అక్కడ పోలీసులు మానవహారం నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య, ఏఆర్ డీఎస్పీ రవికుమార్, ఎస్‌బీ సీఐ ఏ శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్-1 నబి, ఇన్‌స్పెక్టర్-2 సీహెచ్ సూరిబాబు, వన్‌టౌన్, బొమ్మూరు, ధవళేశ్వరం, కడియం సీఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వివాదం

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో ఓ నర్సు వివాదాస్పదంగా వ్యవహరించడంతో శుక్రవారం ఆస్పత్రిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆస్పత్రిలో మేల్ నర్సుగా పని చేస్తున్న పోలాబత్తిన శ్రీనివాసరావు ఇటీవల రిపబ్లిక్‌డేలో కలెక్టర్ అందించిన అవార్డుల ప్రదానోత్సవంలో పేర్లు సిఫార్స్ చేయడంలో ఆస్పత్రి అధికారులు పక్షపాత వైఖరిని అవలంబించారని ఆరోపించాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం కొన్ని ఖాళీఎత్రాలపై కొందరు ఉద్యోగులతో అవార్డులు ఇచ్చిన తీరు అసంతృప్తిగా ఉందని సంతకాలు చేయించాడు. ఆస్పత్రి ఉద్యోగ సంఘం జేఏసీ మద్దతు తనకు ఉందని ప్రచారం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న జేఏసీ నాయకులు మేల్ నర్సు వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఈవిషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని జేఏసీ స్పష్టం చేసింది..

రాజ్యసభ సభ్యుడు పిల్లి బోస్‌కు అస్వస్థత



ద్రాక్షారామ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ స్వల్ప అస్వస్థతకు గుర య్యారు. ఈ విషయంపై ఆయన కుమారుడు నియో జకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్‌ను సంప్ర దించగా శుక్రవారం ఉదయం పార్లమెంటు కు ఏవిధమైన ఆహారం తీసుకోకుండా వెళ్లడం వలన షుగర్ లెవెల్స్ తగ్గిపోవడంతో అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. ప్రస్తుతం కోలుకుంటున్నారని చెప్పారు.

యానిమేటర్ ఆర్పీలకు
ఉద్యోగ భద్రత కల్పించాలి

- యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి

రాజమహేంద్రవరంఅర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే యానిమేటర్లు అందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ యానిమేటర్ల ఆర్పీల యూనియన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షురాలు ఎం.శ్రీదేవి కోరారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో యానిమేటర్ల ఆర్పీల యూనియన్ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. శ్రీదేవి మాట్లాడుతూ అర్బన్‌లో ఉన్న సంఘాలను రూరల్‌లోకి మార్చాలని, 64 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వ ఉద్యోగి, చిరుద్యోగులు, ఔట్ సోర్సింగ్ తదితర ఉద్యోగులు అందరూ కూటమి ప్రభుత్వం హామీలను నమ్మి ఓట్లు వేశారని వారికి న్యాయం చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రతి చిరుద్యోగికి రూ.26,000 జీతం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కనక, కోశాధికారి ఆర్.వరలక్ష్మి మాట్లాడారు. ముందుగా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్, జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షుడు కె.రాంబాబు, మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పి.లావణ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా, తూర్పుగోదావరి జిల్లాలకు నూతన కమిటీలను ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి

కాకినాడ

రేపు ఏపీజీఈఏ జిల్లా తృతీయ కౌన్సిల్ మహాసభ

కాకినాడ సిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఉదయం 10గంటలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) కాకినాడ జిల్లా తృతీయ కౌన్సిల్ మహాసభ ఏర్పాటు చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీఎస్.జగన్నాథం, జిల్లా కార్యదర్శి జె.రాంబాబు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు డీవీ రత్నరాజు తెలిపారు.

తాగునీటి ఇబ్బందులు రాకూడదు

కాకినాడ కమిషనర్ భావన



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవిలో ఎలాంటి తాగునీటి ఇబ్బందులను నగరవాసులు ఎదుర్కోకుండా ఉండేలా ఏర్పాట్లు చేయాలని కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ భావన ఇంజనీరింగ్ విభాగ ఉన్నతాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె విక్టోరియా వాటర్ వర్క్స్ ఆవరణలో ఉన్న తాగునీటి ఫిల్టరేషన్ ప్లాంట్‌ను పరిశీలించారు. వాటి పనితీరు ఎలా ఉన్నదీ గమనించారు. నీరు ఎలా శుద్ధి అవుతుంది, నీటి స్వచ్ఛత, ఫిల్టరేషన్ బెడ్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. కొన్నాళ్లుగా పనిచేయకుండా ఉన్న ఫిల్టరేషన్ ప్లాంట్‌ను వెంటనే అందుబాటులోకి తేవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎస్ఈ కామేశ్వరరావు, ఈఈ మత్స్యరాజు, డీఈ ఫణి తదితరులు కమిషనర్ భావనకు అక్కడున్న పరిస్థితులను వివరించారు.

కమిషనర్ భావన శుక్రవారం తెల్లవారుజాము నుంచి కాకినాడలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ ఎలా జరుగుతుందనే విషయంపై కమిషనర్ దృష్టిసారించారు. జీజీహెచ్ ఏరియా రోడ్డు, కాకినాడ అర్బన్ తహశీల్దార్ కార్యాలయం వీధి, మెయిన్ రోడ్డు, దేవాలయం వీధిలో పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. చెత్త సేకరణ, తరలింపు, వాహనాల పనితీరును గమనించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. 14వ సర్కిల్ కరణంగారి సెంటర్, కృష్ణుడి గుడి వీధి, విశాల్‌మార్టు ఏరియాలో పర్యటించారు. ఇక్కడ చెత్తను ఇష్టానుసారంగా పడేస్తున్న మద్యం దుకాణదారుడికి ఫైన్ వేయాలని ఆదేశించారు. డస్ట్‌బిన్లలో మాత్రమే చెత్త వేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

చిన్నారులతో పని చేయించడం నేరం

కార్మిక శాఖ సహాయ కమిషనరు



సదుస్సులో మాట్లాడుతున్న సహాయ కమిషనరు

పిఠాపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): చిన్నారులతో పనిచేయించడం చట్టరీత్యా నేరమని కార్మిక శాఖ సహాయ కమిషనరు బుల్లిరాణి తెలిపారు. మండల లీగల్ సర్వీసెస్ అథారటీ ఆధ్వర్యంలో పిఠాపురంలోని యానాదుల కాలనీ(భగత్‌సింగ్ నగర్)లో అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. 14 ఏళ్లలోపు బాలబాలికలను పనిలో పెట్టుకోవద్దని, వారంతా పాఠశాలల్లోనే ఉండాలని సూచించారు. ప్రభుత్వం చిన్నారుల చదువు కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నదని, పిల్లలతో పనులు చేయించరాదని స్పష్టం చేశారు. శ్రామికుల కోసం కేంద్రం ఈ శ్రమ పథకం అమలు చేస్తుందన్నారు. సదస్సులో న్యాయవాదులు అనిశెట్టి కాశీవిశ్వనాథరెడ్డి, గుదిమెళ్ల శ్రీభాస్కరాచార్యులు తదితరులు ఉన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన జగన్

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న వర్మ

కాకినాడ సిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గడచిన ఐదేళ్లలో వైసీపీ చెత్త పాలనలో అప్పటి సీఎం జగన్ రాష్ట్రాన్ని రూ.10లక్షల కోట్ల అప్పుల పాలు చేశారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ధ్వజమెత్తారు. కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ అప్పుల నిమిత్తం ఏడాదికి రూ.71వేలకోట్లు అసలు, రూ.లక్షా40వేలు వడ్డీ చెల్లించాల్సిన భారం కూటమి ప్రభుత్వంపై పడిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని ఆయన వివరించారు. వైసీపీ నేతలు ఎవరైనా తనతో చర్చకు వస్తే జగన్ అక్రమాలు నిరూపించడానికి సిద్ధంగా ఉన్నానని వర్మ ప్రకటించారు. సమావేశంలో టీడీపీ నాయకులు మడికి సన్యాసిరావు, ఏ.శివ పాల్గొన్నారు.

'ప్రమాదాల నివారణలో భాగస్వామ్యం కావాలి'

సర్పవరం జంక్షన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వామ్యం కావాలని, హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ పొందాలని జాతీయ రహదారుల అథారిటీస్ (ఎన్‌హెచ్) ఇంజనీర్ శ్రీనివాస్ కోరారు. శుక్రవారం తిమ్మాపురం అచ్చంపేట సెంటర్‌లో ఆర్‌వీఎన్ఎల్ ప్రాజెక్టు, జేపీ కన్‌స్ట్రక్షన్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ అత్యధిక రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందినవారిలో యువకులు అధికంగా ఉంటున్నారన్నా రు. రోడ్డుమీదకు వచ్చేటప్పుడు ఇంటి వద్ద మన కోసం ఎదురుచూసే కుటుంబం ఉన్నది అన్న సంగతి ఆలోచించుకోవాలన్నారు. ప్రాణ రక్షణకు విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు. భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించి, ప్రయాణికులు, వాహనదారులకు కరపత్రాలు అందజేశారు. ఆర్‌వీఎన్ఎల్ ప్రాజెక్టు మేనేజర్ అనంతరావు, ప్రాజెక్టు కోఆర్డినేటర్ చక్కని ప్రభాకరరావు, సిబ్బంది ఉన్నారు.

'అఖండ నామ సంకీర్తన కార్యక్రమం జరగాలి'

పిఠాపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తిరుమల మాదిరిగా అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో 365రోజులు అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించాలని భజన కళాకారులు కోరారు. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో పీఠికాపురం కళావేదికపై పట్టణ భజన కళాకారులు, భజన బృందాలు, గురువుల సమావేశం శుక్రవారం జరిగింది. అన్నమయ్య కళాక్షేత్రం కాకినాడ జిల్లా సమన్వయకర్త సానా నూకరాజునాయుడిని భజన కళాకారులు సత్కరించారు. ఫిబ్రవరి 5న పిఠాపురం బైపాస్‌రోడ్డులోని గోపాల్‌బాబా ఆశ్రమంలో భజన సమ్మేళన సమావేశం జరగనుందని, అన్నమయ్య కళాక్షేత్ర తిరుమల తిరుపతి పీఠాధిపతి విజయశంకరస్వామి రానున్నారని వారు చెప్పారు. భజన కళాకారులు, గురువులు, ఆధ్యాత్మిక వాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వేణు నారాయణరావు, ఎస్‌డీ రహీంతుల్లా, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ఎడ్ల ప్రభాకర్, వినరపు యేసు, వినరపు రామన్నరాజు, అల్లూరి వెంకటపతి తదితరులున్నారు.

నరసింహారావు సిద్ధాంత వ్యాసానికి పీహెచ్‌డీ



నరసింహారావు

జేఎన్టీయూకే, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నిపుణుల బృందం సిఫార్సుల మేరకు టి.నరసింహారావు సిద్ధాంత వ్యాసానికి పీహెచ్‌డీగా జేఎన్టీయూకే ఆమోద ముద్ర లభించినట్లు పీఆర్వో రవీంద్రనాథ్ తెలిపారు. ఆయనకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు సీఎస్ఈ విభాగంలోని ఏ న్యూ అప్రోచ్ టు జనరేట్ సింప్లిఫైడ్ సొల్యూషన్ టు ద ఇంబ్యాలెన్స్ డేటాసైన్స్ అనే అంశంలో చేసిన పరిశోధనకుగాను లభించిందన్నారు. నరసింహారావు తన సిద్ధాంత వ్యాసాన్ని తెలంగాణలోని హైదరాబాద్‌లోని జేఎన్టీయూహెచ్ యూసీఈహెచ్ సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ డి.వసుమతి ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

బాలకనకదుర్గ విగ్రహ ప్రతిష్ఠ

తాళ్లరేవు/యానాం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు మండలం జార్జీపేటలో ఏటుగట్టున నూతనంగా నిర్మించిన బాలకనకదుర్గమ్మ ఆలయ ప్రతిష్ఠ శుక్రవారం నిర్వహించారు. పుణ్య దంపతులతో వేద పండితు ప్రత్యేక పూజలు చేయించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయం నిర్మాణానికి సహకరించిన దాతలకు కమిటీసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కుంభమేళాకు ప్రత్యేక బస్సులు



బస్సులను ప్రారంభిస్తున్న దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 31(ఆంధ్రజ్యోతి): కాకినాడ డిపో నుంచి శుక్రవారం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు రెండు స్టార్ లైనర్ స్లీపర్ ప్రత్యేక బస్సులను డిపో మేనేజర్ ఎంవీవీ మనోహర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సులు కాకినాడ నుంచి బయలుదేరి భువనేశ్వర్, పూరి, కోణార్క్ మీదుగా ప్రయాగరాజ్ చేరుకుని అక్కడ త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు పూర్తయిన తర్వాత తిరుగు ప్రయాణంలో వారణాసి, గయా, బుద్ధగయ క్షేత్రాలు చూపించి తిరిగి ఫిబ్రవరి 8న కాకినాడ చేరుతాయి. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ కె.ప్రభాకర్‌రావు, పీఆర్వో సీహెచ్ వెంకటరాజు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పాదగయలో విస్తృత ఏర్పాట్లు చేయాలి

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

మహాశివరాత్రి ఏర్పాట్లపై డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ మధుసూదన్ సమీక్ష



పాదగయలో మహాశివరాత్రి ఏర్పాట్లపై పరిశీలన చేస్తున్న ఓఎస్‌డీ మధుసూదన్, అధికారులు

పిఠాపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురంలోని పాదగయ క్షేత్రానికి తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓఎస్‌డీ మధుసూదన్ సూచించారు. పాదగయలో మహాశివరాత్రి ఏర్పాట్లపై ఆయన శుక్రవారం పరిశీలన జరిపారు. అనంతరం దేవదాయ, పోలీసు, రెవిన్యూ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం రోజున లక్షల సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే అవకాశం ఉన్నందున క్యూలైన్లు పటిష్ఠంగా ఏర్పాటు చేయాలని, ఈ బాధ్యతను ఆర్‌అండ్‌బీ శాఖ తీసుకోవాలన్నారు. భక్తులకు సులభతరంగా దర్శనాలు అవ్వడంతో పాటు పాదగయ పుష్కరిణిలో స్నానాలు, స్వామి దర్శనం కోసం ప్రత్యేక ప్రవేశ, బయటకు వచ్చే మార్గాలు ఏర్పాటు చేయాలన్నారు. పాదగయ పుష్కరిణిలో నీరు ఎప్పటికప్పుడు తొలగించి కొత్త నీరు పెట్టేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా బోరు ఏర్పాటు చేయాలని సూచించారు. మహాశివరాత్రి పర్వదినాలు అనంతరం పుష్కరిణి నీరు నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా కార్యాచరణ సిద్ధం చేస్తామని తెలిపారు. తాగునీటి సరఫరా, లైటింగ్, తాత్కాలిక టాయిలెట్లు, పారిశుధ్య నిర్వహణ బాధ్యతలను పురపాలక సంఘం తీసుకోవాలని సూచించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని తీసుకోవాలన్నారు. నిధులు అందుబాటులో లేకుండా తమకు తెలియజేయాలని వాటిని సమకూరుస్తామని తెలిపారు. క్యూలైన్ల వద్ద అడ్డంకిగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని విద్యుత్‌శాఖాధికారులకు సూచించారు. పాదగయకు అన్నివైపులా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, అన్ని ముఖ్య ప్రాంతాల్లో పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఉత్సవాలు సమయంలో ఏ లోటుపాట్లుకు తావివ్వవద్దని, నిధులు అవసరమైతే ఏర్పాటు చేస్తామని చెప్పారు. అంతకుముందు ఓఎస్‌డీ మధుసూదన్ పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. సమావేశంలో పాదగయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, మున్సిపల్ కమిషనరు నామా కనకారావు, పిఠాపురం సీఐ శ్రీనివాస్, తహశీల్దారు వీవీగోపాలకృష్ణ, ఎంపీడీవో చిన్నారావు, ఎలక్ట్రికల్ ఈఈ ప్రభాకర్, పట్టణ ఎస్ఐ మణికుమార్, అడిషనల్ ఎస్ఐ జానీభాషా, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

పాదగయ క్షేత్రం ఎదురుగా ఉన్న బాలికల ఇంటిగ్రేటెడ్ వసతిగృహ సముదాయాన్ని మధుసూదన్ సందర్శించారు. మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. అన్ని చోట్ల పనులు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు

పూర్తిస్థాయిలో తాగునీరు

గొల్లప్రోలు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందేవిధంగా చూడాలని, ఇందులో ఏ లోటుపాట్లు ఉండరాదని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓఎస్‌డీ మధుసూదన్ స్పష్టం చేశారు. పట్టణానికి తాగునీరు అందించేందుకు తాటిపర్తిలో తవ్విన బోర్లు, అందులో నుంచి వస్తున్న నీటిని, పైప్‌లైన్ పనులను ఆయన శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం గొల్లప్రోలులో తహశీల్దారు కార్యాలయం, అర్బన్‌హెల్త్ సెంటర్ భవనాలను పరిశీలించి పనుల తీరుపై ఆరా తీశారు. నగరపంచాయతీ కమిషనరు నామా కనకారావు, పబ్లిక్‌హెల్త్ ఈఈ గంగరాజు, ఏఈ ప్రభాకర్, తహసీల్దారు సత్యనారాయణ, ఎంపీడీవో కర్రి స్వప్న, ఆర్ఐ బాలకృష్ణ తదితరులున్నారు.

దోమల బెడదతో ప్రజలకు నిద్ర కరవు

గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశంలో కౌన్సిలర్లు



సమావేశంలో సమస్యలు ప్రస్తావిస్తున్న కౌన్సిలర్లు

గొల్లప్రోలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కంటి మీద కునుకు ఉండడం లేదు. అవి కుడితే దద్దుర్లు వచ్చి దురదలు వస్తున్నాయి. దోమల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన జరిగిన బడ్జెట్, సాధారణ సమావేశాల్లో దోమల బెడదపై వారు ఏకరవు పెట్టారు. దోమలు తమపై దండయాత్ర చేస్తున్నా, నివారణకు చర్యలు ఉండటంలేదని కౌన్సిలర్లు మొగలి దుర్గానందరావు, దాసం దేవి తెలిపారు. దీనిపై కమిషనరు నామా కనకారావు స్పందించి యాంటీ లార్వా ఆపరేషన్ ప్రారంభిస్తామన్నారు. మున్సిపల్ స్టాక్‌యార్డులో జరిగిన ప్రమాదంలో ఫాగింగ్ యంత్రాలు కాలిపోయాయని చెప్పారు. కొత్త యంత్రాలు కొనుగోలుకు ప్రతిపాదిస్తున్నామని తెలిపారు. డ్రెయిన్లల్లో పూడిక తొలగించక దుర్గంధపూరిత వాతావరణం ఉందని కౌన్సిలరు ఖైనం భవానీ చెప్పారు. డ్రెయిన్ల డీసిల్టేషన్‌కు రూ.12లక్షల నిధులు ఉన్నాయని, మార్చిలోగా టెండర్లు పిలిచి పనులు చేపడతామని కమిషనరు తెలిపారు. వీధిలైట్లు కొత్తవి వేసినా అవి సక్రమంగా వెలగడం లేదని టీడీపీ కౌన్సిలరు గుళ్ల సుబ్బారావు తెలిపారు. జగనన్న కాలనీలో కుళాయిల మూతలు విరిగిపోవడం వల్ల నీరు వృథాగా పోతున్నదని చెప్పారు. రాజుచెరువు గట్టుపై చెత్తాచెదారం, జంతువుల కళేబరాలను వేస్తున్నారని, దీంతో ఆ ప్రాంతమంతా దుర్గంధపూరితంగా మారుతున్నదని కోఆప్షన్ సభ్యుడు మొగలి జయబాబు తెలిపారు.

రూ.172.05 లక్షల మిగులుతో బడ్జెట్

గొల్లప్రోలు నగరపంచాయతీ 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.172.05లక్షల మిగులుతో రూపొందించిన అంచనా బడ్జెట్‌కు సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అన్ని మార్గాల ద్వారా రూ.783.82లక్షల ఆదాయం లభిస్తుందని, ప్రారంభ నిల్వ రూ.670.13లక్షలతో కలిపి ఆదాయం రూ.1453.95లక్షలుగా ఉంటుందని వివరించారు. కార్యాలయ నిర్వహణ, ప్రజారోగ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్లు నిర్వహణ, బిల్లులు, అభివృద్ధి పనులకు రూ.847.60లక్షలు వ్యయం అవుతుందని, సాధారణ వ్యయం రూ.341.56లక్షలు, ఇతర వ్యయాలు కలిపి అన్నిమార్గాల ద్వారా ఖర్చు రూ.1281.91లక్షలు అవుతుందని తెలిపారు. 2024-25 సవరించిన అంచనా బడ్జెట్‌ను సమావేశం ఆమోదించింది. వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుకుంటున్న అధికారులు

సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్‌లో సభ్యులు



అధికారులపై ధ్వజమెత్తుతున్న సభ్యులు

సామర్లకోట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేసే వేసవి జలాశయంలో ఇటీవల తరచూ చేపలు మృతిచెందుతూ దర్గంధం వస్తున్నా ఆదే నీటిని కుళాయిల ద్వారా సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుకుంటున్నారని సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ అధికారుల వైఖరిపై తీవ్రస్థాయిలో భగ్గుమంది. మున్సిపల్ సాధారణ సమావేశం శుక్రవారం చైర్‌పర్సన్ జీ అరుణ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనల మేరకు సమావేశంలో అజెండాపై ఎటువంటి చర్చ లేకుండా వాయిదా వేస్తున్నట్టు చైర్‌పర్సన్ ప్రకటించారు. తదుపరి జరిగిన జీరో అవర్‌లో పలు సమస్యలపై చర్చలో భాగంగా సీనియర్ కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు మాట్లాడుతూ జలాశయంలో చేపలు మృతిచెందగా నీటి నమూనాలు పరిశీలన చేయకుండా తాగునీటిగా ఎలా సరఫరా చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై మున్సిపల్ డీఈ శశిధర్ మాట్లాడుతూ అవగాహన లేకుండా మాట్లాడవద్దని పలు పరిశ్రమల నుంచి కలుషిత జలాలు కాలువలో కలుస్తున్నాయని అనడంతో చంద్రరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈ వ్యాఖ్యల పట్ల చైర్‌పర్సన్‌తో సహా పలువురు సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వ్యాఖ్యలు వెనుకకు తీసుకోవాలని పట్టుబట్టారు. డీఈ నుంచి ఏ స్పందన లేకపోవడంతో నిరసనగా చంద్రరావు సమావేశం నుంచి వాకౌట్ చేస్తూ బయటకు వెళ్లిపోయారు. కోఆప్షన్ సభ్యుడి సలహాలు పరిగణనలోకి తీసుకోవాల్సిన అధికారులు అమర్యాదగా మాట్లాడడం ఎంతమాత్రం తగదని పలువురు సభ్యులు ఆరోపించారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో పిట్టా సత్యనారాయణ, నేతల హరిబాబు, జాన్ మోజెస్, సేపేని సురేష్, తదితరులు ఉన్నారు. పట్టణంలో పలు వార్డుల్లో సమస్యలపై పరిష్కారం చూపడంలో అధికారులు శ్రద్ధ కనబర్చడంలేదని అధికారులు జీతాలు తీసుకునేందుకే ఉన్నారని నేతల హరిబాబు ఆరోపించారు. కాగా కమిషనర్ శ్రీవిద్య అస్వస్థత కారణంగా 2రోజుల పాటు సెలవు పెట్టారని అధికారులు తెలిపారు. సభ్యులు అడిగిన సమస్యలకు సమాధానం చెప్పే అధికారులే కరువయ్యారని పలువురు ఆగ్రహం చెందారు.

వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం వాడివేడిగా సాగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు అధ్యక్షతన నిర్వహించారు. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్యం అధ్వానంగా ఉందని, పార్కుల వద్ద కనీసం పారిశుధ్య నిర్వహణ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. శతాబ్ది పార్కు వద్ద ఓవ్యక్తి పార్కింగ్ పేరుతో వచ్చిన సందర్శకుల నుంచి డబ్బులు వసూలు చేయడం ఏంటని ప్రశ్నించారు. శానిటరీ ట్రాక్టర్లకు కొట్టించే ఆయిల్ విషయంలో అవకతవకలు జరుగుతున్నట్టు తెలుస్తోందన్నారు. అలాగే పారిశుద్యంపై శానిటరీ ఇనస్పెక్టర్ పర్యవేక్షణ లేకుండా పోయిందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ మాట్లాడుతూ సిబ్బంది పనితీరు మార్చుకోవాలన్నారు. శానిటరీ సిబ్బంది వాహనాలకు కొట్టించే ఆయిల్ విషయంలో సంతృప్తికరమైన సమాధానం ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. కౌన్సిలర్ తులికి సత్యభాస్కరరావు మాట్లాడుతూ శ్మశాన వాటికల్లో పనిచేసే సిబ్బందికి జీతాలు ఎందుకు పెండింగ్‌లో పెట్టారని ప్రశ్నించారు. అజెండాలో పెట్టే ప్రతీ అంశం అర్థమయ్యేరీతిలో ప్రచురించాలన్నారు. కౌన్సిలర్ ఆకుల కృష్ణబాపూజీ మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బందికి ఎన్నిసార్లు సమస్యలను వివరించినా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ కేవీ పద్మావతి, కౌన్సిలర్లు అరెళ్ల వీర్రాఘవరావు, వాసంశెట్టి గంగ, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిల్‌లో ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

మంత్రి నారాయణను కలిసిన ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ శుక్రవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మున్సిపల్‌శాఖా మంత్రి పొంగూరు నారాయణను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలో గల అర్బన్ వార్డుల అభివృద్ధికి సహకారం అందించాలని నారాయణను కోరారు.



మంత్రి నారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

మల్లవరంలో దూడల ప్రదర్శన



గొల్లప్రోలు రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం మల్లవరంలో దూడల అందాల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువుల ఆరోగ్య శిబిరాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేసి విజేతలుగా నిలిచిన దూడల యజమానులైన రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ సూర్యప్రకాష్, డీడీ డాక్టర్ అంబేద్కర్, ఏడీ ఎం.శ్రీనివాసరావు, పశువైద్యాధికారులు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ హిమజ, చైతన్య, రవితేజ, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

పెద్దాపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ సీహెచ్.వెంకటలక్ష్మీ శుక్రవారం తనిఖీ చేశారు. మహారాణీ కళాశాల, లూథరన్ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు.

వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆత్మార్పణ దినోత్సవం



పిఠాపురంలో అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ దంపతులు

పిఠాపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటగుమ్మం సెంటర్ సమీపంలో వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, లక్ష్మీదేవి దంపతులు వాసవి అమ్మవారికి పట్టువస్త్రాలు, పండ్లు సమర్పించారు. అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్యుల కోరిక మేరకు ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారని వర్మ తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు, సామర్లకోటలో...

గొల్లప్రోలు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ ప్రతినిధులు అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమంలో అధికంగా ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

సామర్లకోట: ఆర్యవైశ్య సేవా సంఘం, వాసవి వనితా క్లబ్, వాసవి కపుల్స్ క్లబ్‌లచే సంయుక్తంగా నిర్వహించిన వేడుకల్లో అమ్మవారికి విశేష అభిషేకపూజలు, సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం చినజీయర్ స్వామి వికాసతరంగిణిచే పేదలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 100 మంది పేదలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పేదలకు బియ్యం, దుప్పట్లు, చీరలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు మానేపల్లి బంగార్రాజు, వెలగా వెంకటనగేష్, కటకం రత్నకుమారి, కటకం హైమావతి, ఆర్‌సీకె.భాను, ఎం.సతీష్, కటకం త్రిమూర్తులు, కటకం సృజన్, కె.పద్మరత్నం, గుడిమెట్ల సమత, కాపుగంటి పైడిరత్నం, కంచర్ల మధుసుష్మామోహనీ, దొంతుల సుధీర్‌కుమార్, నేతి కుమారస్వామి, కెఎల్ఎన్‌జీపీ పవన్‌కుమార్, ఊరానాగమణి, లక్ష్మీసుభద్ర పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి మోక్షం



యండపల్లి-అమీనబాద్ పుంత రోడ్డులో గుంతలు పూడ్చివేసిన దృశ్యం

కొత్తపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చొరవతో మండలంలో గుంతలతో ఉన్న గ్రామీణ పుంతరోడ్లు, ఆర్ అండ్‌బీ రోడ్లకు మోక్షం కలిగింది. ఎన్నో ఏళ్లుగా అతీగతీ లేకుండాపోయిన కొత్తపల్లి ఊరచెరువు గట్టు నుంచి అమీనబాద్ వెళ్లే పుంత రోడ్డులో పూర్తిస్థాయిలో గుంతలు పూడ్చి నిర్మాణం చేపట్టారు. పెద్ద గోతులతో నడవడానికి వీలు లేకుండా మారిన వాకతిప్ప జంక్షన్ నుంచి అమీనబాద్ వెళ్లే రహదారిలో గుంతలు పూడ్చారు. దీంతో రైతులు, ప్రయాణికులు డిప్యూటీ పవన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

'విద్యాభివృద్ధికి సహకారం'

పిఠాపురం రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తానని జనసేన నాయకుడు రొంగల జయదీప్ అన్నారు. పిఠాపురం మండలం పి.తిమ్మాపురం మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆయన స్టీలు పేట్లు సమకూర్చి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కాకినాడ రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రేపూరులో విద్యుత్ లోటల్టేజీ సమస్యకు పరిష్కారం లభించింది. సమస్యను గ్రామంలోని కూటమి నాయకులు, గ్రామస్థులు ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి రూ.5,00,000 విలువ చేసే 40కేవీ కెపాసిటీ గల నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ఏర్పాటు చేసి పారంభించారు. ఎమ్మెల్యే నానాజీకి కూటమి నాయకులు, గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు.

ఏలేరు జలాశయంలో చేప పిల్లలు విడుదల

ఏలేశ్వరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం, బీసీలకు 40 శాతం సబ్సిడీపై 1.38 లక్షల చేప పిల్లలను మత్స్య శాఖ అధికారులు ఇచ్చారు. శుక్రవారం వాటిని జె.అన్నవరంలో గల ఏలేరు రిజర్వాయర్‌లో జిల్లా మత్స్యశాఖ అధికారి కరుణాకర్, ఎంపీడీవో సూర్యనారాయణ విడిచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారులు ప్రభుత్వ రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మన్యంకొండ జాతరకు స్థలాల పరిశీలన



పొల్లూరు జలపాతం వద్ద పరిసరాలను పరిశీలిస్తున్న మల్కన్‌గిరి జిల్లా అడిషనల్ ఎస్పీ బృందం

మోతుగూడెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల గిరిజనుల ముఖ్య పండుగ ముత్యాలమ్మ తల్లి (బడా యాత్ర) మన్యంకొండ జాతర మార్చి 3న జరగనుంది. ఈ సందర్భంగా ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా అడిషనల్ ఎస్పీ రోతో, డీఎస్పీ ఆర్కే దాస్, ఎస్‌డీపీవో సచిన్ పటేల్ శుక్రవారం పొల్లూరు జలపాతాన్ని సందర్శించారు. సీలేరు నది వద్ద అమ్మవారు పడవ దాటే ప్రదేశాన్ని పరిశీలించారు. వేలాది మంది భక్తుల కోసం జలపాతం వద్ద చేయవలసిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ విషయాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని అడిషనల్ ఎస్పీ రోతో చెప్పారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న హెచ్‌టీసీ సభ్యులు

రంపచోడవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం హోలి ట్రినిటీ లూథరన్ చర్చ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కాకవాడ, రాకోట, చెలకవీధి, సువర్ణవాడ గ్రామాలకు చెందిన 250మందికి దుప్పట్లు, వస్త్రాలు పంపిణీ చేసినట్టు ట్రినిటీ చర్చ్ గురువు దేవభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా దేవభూషణ్ మాట్లాడుతూ దేవుని ప్రేమతో మన్యం ప్రజలకు సహాయం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌టీసీ చైర్మన్ జాన్‌సన్, దేవదాసు, గుంటు నానాజీ, నక్క శ్రీధర్, మనోహర్, రత్నరాజ్, చంద్రశేఖర్, మచ్చకుమారి, సుధజాన్, దయాకర్, డి.సునీత, సతీష్, శేఖర్ పాల్గొన్నారు.

మోతుగూడెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పరిధిలోని ఫోర్‌బై గ్రామంలోని 60 మంది నిరుపేదలకు ఏపీ జెన్‌కో ఉద్యోగి వెంకటేశ్వరరావు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన వెంట సాయిబాబా, పప్పు విశ్వనాథం, భగవాన్ ఉన్నారు.

వాసవీమాతకు సారె సమర్పణ



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రంపచోడవరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక దేవిగుడి సెంటర్‌లో వెలసిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆలయ అర్చకులు యజ్ఞసూర్యకిరణ్, సిద్ధాంతి మంతాన సత్యనారాయణ ఆధ్వర్యంలో సారె సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంత రం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన చేశారు. మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, విశ్వహిందూ పరిషత్, సమరత ఫౌండేషన్, ధర్మప్ర చార భక్తమండలి సభ్యులు నల్లిమిల్లి వెంకట రామారెడ్డి, గుడ్ల అంక శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌కు ఘన సన్మానం



జూనియర్ అసిస్టెంట్‌ను సత్కరిస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన కాకూరు వరలక్ష్మికి పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డీవీ గోపాలకృష్ణ, పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానసభ నిర్వహించి ఆమెను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రెసిడెంట్ పెద్దిరాజు, ఎంఈవో కారం సత్యనారాయణదొర, ఉపాధ్యాయులు చప్పా వీవీఎస్ మూర్తి, టి.బొజ్జయ్య, సీహెచ్ శివకృష్ణ, ఎం.కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



రాజవొమ్మంగి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగింది. తొలుత సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా ఆరిపాక సూరిబాబు, ఉపాధ్యక్షుడిగా ఉదయభాను, కార్యదర్శిగా పుట్టా రామరాజు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధిగా ఈకా శ్రీనుబాబు, కోశాధికారిగా పోలిన సత్తిబాబు, కన్వీనర్‌గా బొడారపు శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు బాలరాజు, దుర్గాప్రసాద్, శివప్రసాద్, కృష్ణ ఉన్నారు.

పదవీ విరమణ పొందిన ప్రసాద్‌కు సత్కారం

రంపచోడవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో జూనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన కర్రి వీరవెంకటసత్యప్రసాద్‌ను డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సన్మానించారు. ఏపీడీలు శ్రీనివాస్, రాంబాబు, ఎంపీడీవో ఎస్.శ్రీనివాసుదొర, ఏడుమండలాల ఉపాధి హామీ ఏపీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు





ఏలేశ్వరంలో దీపోత్సవంలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘు సభ్యులు, జగ్గంపేటలో వాసవీ అమ్మవారిని దర్శించుకుంటున్న దృశ్యం

ఘనంగా వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం

ఏలేశ్వరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కనకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్యులు, వాసవీ క్లబ్ ప్లాటినం కపుల్స్, వనిత క్లబ్ నేతృత్వంలో తెల్లవారుజాము నుంచి పురోహితుడు బుజ్జి గణపతి పూజ, వాసవీ పూజ, సామూహిక కుంకుమ పూజలు, అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం జై వాసవి.. జైజై వాసవి... ఓం నమో వాసవాంబాయ నామస్మరణతో ఏలేశ్వరం మార్మోగింది. ప్రమిదల్లో దీపాలు వెలిగించి నగర సంకీర్తన చేపట్టారు. భక్తులకు ప్రసాదాలు అందించారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు కంచర్ల అశ్వనిరమేష్, సెక్రటరీ ఇమ్మడిశెట్టి రత్నకృష్ణ, పూర సుప్రియ మణికంఠ, సభ్యులు ప్రగళ్లపాటి కామేష్, గోగుల మూర్తి, పిరాట్ల రవి, వాగు రమేష్, కాపుగంటి రామ్మోహన్, మురళీ, జగన్మోహనరావు, వాగు రాజేష్, వాగ బలరాం, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

జగ్గంపేట (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద గల వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని మామిళ్లపల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సతీమణి మణి, ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పొట్టి రాజేష్-శ్రీవల్లి దంపతులు పీటలపై కూర్చుని అమ్మవారికి గణపతి పూజ, కుంకుమ పూజ, లలిత సహస్రనామ పారాయణ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, జీను మణిబాబు, వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మానేపల్లి బంగార్రాజు, కొత్త భైరవకృష్ణ, కొత్త రాము, బోండా నూకబాబు, మానేపల్లి వీర్రాజుగుప్తా, పాబోలు స్వామి, మాతంశెట్టి సాయిబాబా, బొండాడ జగన్, బోండా అయ్యప్ప, ముమ్మిడి వరపు లలిత్‌బాబు, మానేపల్లి రామానుజ, ఎస్. వెంకన్నబాబు, కాకి ఆనందం, బోండా రాంపండు, బోండా కాశి, ఏఎస్ఐ సన్యాసిరావు, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు బోండా విజయమల్లిక, అధిక సంఖ్యలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, కుంకుమార్చన అనంతరం మహిళలు పదకొండుసార్లు సామూహిక లలితాసహస్రనామ పారాయణ చేశారు.

శంఖవరం (ఆంధ్రజ్యోతి): వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని కత్తిపూడి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కత్తిపూడిలో సంఘ సభ్యులు ర్యాలీ నిర్వహించిన అనంతరం అన్నవరం వెళ్లి వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సంఘ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో స్థలం లేక వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణం చేపట్టలేకపోతున్నామని, ప్రభుత్వం స్థలం ఇస్తే వైశ్యులంతా ఏకమై ఆలయ నిర్మాణం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఉప్పల బాబీ, కార్యదర్శి కొత్తా సిద్ధు, కట్టా బసవయ్య, సభ్యులు ఎస్.చలపతిరావు, మురళీ, గ్రంధి పాండురంగారావు, చెన్నా శ్రీకాంత్, ఉప్పల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



కిర్లంపూడిలో సామూహిక లలితా సహస్రనామ పారాయణ



అన్నవరంలో అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్నకత్తిపూడి వాసవీ క్లబ్ సభ్యులు

అంతర్జాతీయ సదస్సులో 'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

గండేపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం దేవిహోసూరులో గల హవేరి హార్టికల్చర్ ఇంజనీరింగ్, ఫుడ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్టు విభాగాధిపతి డాక్టర్ బి.కృష్ణ కాంత్ తెలిపారు. పోస్టర్ ప్రదర్శనలో ప్రథమ, మౌఖిక ప్రదర్శనలో తృతీయ, ప్రాజెక్టు ప్రదర్శనలో తృతీయ స్థానాల్లో నిలిచి సరిఫికెట్లు అందుకున్నారు. విజేతలను, మెంటార్స్ డాక్టర్ వేదాంతం సాయికృష్ణ, ఎం.మారుతికుమార్, జె.లహరికసూర్యసాయి, డి.దాక్షాయణిలను ఆదిత్య యూనివర్శిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి, డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి అభినందించారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

ముగిసిన జాతీయ స్థాయి టెక్ హ్యాకథాన్

గండేపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆదిత్య యూనివర్శిటీలో రెండు రోజులు జరిగిన జాతీయ స్థాయి టెక్ హ్యాకథాన్ శుక్రవారం ముగిసింది. విద్యార్థులు స్మార్ట్ అగ్రికల్చర్, హెల్త్‌కేర్, ఎనర్జీ మేనేజ్‌మెంట్, స్మార్ట్ ట్రాన్స్‌పోర్టేషన్, క్లీన్ ఎనర్జీ వంటి విభిన్న రంగాల్లో వినూత్న ఆలోచనలు ప్రదర్శించారని ప్రో చాన్సలర్ డాక్టర్ సతీష్‌రెడ్డి తెలిపారు. డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, వివిధ విభాగాల డీన్‌లు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ప్రో చాన్సలర్ సతీష్‌రెడ్డి





కోటనందూరు, ప్రత్తిపాడుల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన తహసీల్దార్లు సుభాష్, సూర్యప్రభ

ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలి

ప్రత్తిపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని తహసీల్దారు సూర్యప్రభ కోరారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. కోడ్‌ను ఉల్లంఘిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు కొండపల్లి శ్రీనివాస్, సింగిలిదేవి సత్తిరాజు, దరణాలకోట శ్రీను, మానుకొండ లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రజాప్రతినిధులందరూ సహకరించాలని తహసీల్దారు టి.సుభాష్ కోరారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఘర్షణలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. మండలంలో మొత్తం రెండు బూత్‌ల్లో 1,173 ఓట్లు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. డిప్యూటీ తహసీల్దారు పి.సత్యనారాయణ, టీడీపీ నేత, మాజీ ఎంపీపీ డి.చిరంజీవి రాజు, సామినీడి కృష్ణార్జున పాల్గొన్నారు.



గిరిజనుల సమస్యలు పరిష్కరించండి

ప్రత్తిపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సబ్ ప్లాన్ ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల సమస్యలపై దృష్టి సారించాలని బీజేపీ మండల అధ్యక్షుడు వూటా వీరబాబు శుక్రవారం తహసీల్దారు ఎం.సూర్యప్రభను కోరారు. ఇటీవల బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్‌తో కలిసి మెట్టుచింత, ఉలిగోగుల గ్రామాల్లో పర్యటించిన సందర్భాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, వాటర్ ట్యాంక్‌కు స్థల సేకరణ, కుల ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని తహసీల్దారును కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

తుని రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తుని ఎక్సైజ్ పరిధిలో కల్లు గీత కార్మికులకు రిజర్వు చేసిన ప్రాంతాల్లో మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ పట్టాభి చౌదరి తెలిపారు. తుని మున్సిపాలిటీ, కోటనందూరు, తొండంగి మండలాల్లో కల్లు గీత కార్మికులు శెట్టిబలిజ ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులను ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5గంటలలోపు తుని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో అందించాలన్నారు.

అభిమానులతో 'ముద్రగడ' ఆత్మీయ సమావేశం

ప్రత్తిపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఫలితం ఆశించకుండా ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమని మాజీ మంత్రి, వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అన్నారు. మండలంలోని ఒమ్మంగిలో శుక్రవారం ఆయన వైసీపీ కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబుతో కలిసి పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పద్మనాభం తన కుమారుడిని అందరికీ పరిచయం చేసి ఆశీర్వదించాలని కోరారు. అక్కడి నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులతో కలిసి ర్యాలీగా మూడు రోడ్ల కూడలికి చేరుకున్నారు. అంబేడ్కర్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, జడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, దొరబాబు, ఎంపీపీ గోళ్ళ కాంతిసుధాకర్, వైసీపీ నాయకులు జలిగంపల ప్రభాకరరావు, గుడాల వెంకటరత్నం, శిగడం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

కోటనందూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరపుకోటలో తాటాకిల్లు కాలిపోయి బీజా సింహాచలం సర్వం కోల్పోయింది. ఎస్ఐ టి.రామకృష్ణ బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించారు. రూ.10వేలు ఆర్థిక సహాయం, బియ్యం, వంట సామగ్రి అందజేశారు.



ఫోరెన్సిక్స్ నాల్గవ సంచికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

'ఫోరెన్సిక్స్' నాల్గవ సంచిక ఆవిష్కరణ

గండేపల్లి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఫోరెన్సిక్ సైన్స్ కాలేజీ రూపొందించిన 'ఫోరెన్సిక్స్' నాల్గవ సంచికను కాకినాడ ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ట్రైనీ డీఎస్పీ ఎం.జీవన శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విలాస్ అనిల్ చవాన్ పాల్గొన్నారు.

సహకార బ్యాంకు డైరెక్టర్ సోమరాజు మృతి



తుని రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తుని మండలం ఎస్.అన్నవరం గ్రామానికి చెందిన జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు శుక్రవారం మృతి చెందారు. ఈయన ఎస్.అన్నవరం సొసైటీ అధ్యక్షుడిగా 30సంవత్సరాలు పైగా సేవలందించారు. సోమరాజు మృతికి పలు రాజకీయల పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

ఇద్దరు విద్యార్థుల అదృశ్యంపై కేసు నమోదు

తుని రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తుని కొబ్బరితోట వీధికి చెందిన 14ఏళ్ళ యడ్ల హేమంత్, 15ఏళ్ళ మచ్చుపల్లి శ్యామ్ ట్యూషన్‌కు వెళ్లి రాకపోవడంతో వారి తల్లిదండ్రులు తుని పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తుని పట్టణ సీఐ గీత రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96572 నెంబర్‌కి సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

మహా కుంభమేళా యాత్రకు తుని నుంచి ఆర్టీసీ బస్సు

తుని రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాకి తుని నుంచి ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజరు రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 11న బయల్దేరే బస్సు 21న తిరిగొస్తుందన్నారు. టిక్కెట్ ధర రూ.16,500. టిఫిన్, భోజనంతో పాటు ఉచిత ఏర్పాట్లు ఉంటాయి. మరిన్ని వివరాలకు 73829 13286 నెంబరును సంప్రదించాలన్నారు.